PRGI Reg No -“APTEL/26/A1193

# నేటి శుభోదయ

ప్రతి క్షణం – ప్రజల కోసం

తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...



ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, సంపుటి 01, సంచిక 212, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, మంగళవారం - 22 - సెప్టెంబర్ - 2026 , వెల రూ.5/-

## చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని: హరీశ్ రావు

సిద్దిపేటలో తన భూముల పరిశీలనపై హరీశ్ రావు స్పందన



- వస్తున్నారని చెబితే తానే ఏర్పాట్లు చేసేవాడినని వ్యాఖ్య
- 3,000 మంది పోలీసుల మోహరింపుపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన హరీశ్
- తన ఆస్తులన్నీ అఫిడవిట్‌లో ప్రకటించానని స్పష్టీకరణ
- అబద్ధాలు ప్రచారం చేయొద్దని కాంగ్రెస్ నేతలకు హితవు

# అభివృద్ధి, ఆర్థిక ప్రగతిలో కుప్పం దూసుకెళ్తోంది..!

## కుప్పం బహిరంగ సభలో.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

- ★ జీవీఏలో 37 శాతం వృద్ధి.. తలసరి ఆదాయం 35 శాతం పెరుగుదల
- ★ పరిశ్రమల్లో రూ.9,872 కోట్ల పెట్టుబడులు.. 80,124 మందికి ఉపాధి లక్ష్యం
- ★ ‘స్వర్ణ కుప్పం’ దిశగా సమగ్ర అభివృద్ధి
- ★ కుప్పం బహిరంగ సభలో.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



చిత్తూరు జిల్లా కుప్పం: కుప్పం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ‘స్వర్ణ కుప్పం’గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కుప్పంలో రెండు రోజు పర్యటనలలో భాగంగా సోమవారం కొత్తపేటలోని ప్రజా వేదిక వద్ద స్వర్ణ కుప్పం సాధించి అమలులో దిశగా లబ్ధిదారులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. మిగతా 2 లో



## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

- ఏపీలో జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్ల స్టైఫండ్ పెంపు
- ఎంబీబీఎస్, బీడీఎస్ ఇంటర్న్‌లకు 10 శాతం పెరుగుదల
- పీజీ విద్యార్థులకు 5%, సూపర్ స్పెషాలిటీ వారికి 3.5% పెంపు
- ప్రభుత్వంపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు ఆర్థిక భారం
- 2026 జనవరి 1 నుంచే పెంపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడి

## 45 గంటలు.. నాలుగు రాకెట్లు.. 30 ఉపగ్రహాలు.. అంతరిక్ష రంగంలో చైనా దూకుడు



ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చిన నాలుగు రాకెట్లు

మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ప్రయోగాలు

రెండు రాకెట్లను అభివృద్ధి చేసిన ప్రైవేటు సంస్థలు

నాలుగు ప్రయోగాల్లో జరగని రాకెట్ దశల రికవరీ

# ‘రౌడీయిజం చేసేవారి తోక కత్తిరిస్తాం’..

## టీచర్లపై దాడిని ఖండించిన చంద్రబాబు

టీచర్లపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం. కఠిన చర్యలు తీసుకుంటాం



అమరావతి: విజయవాడలో స్పోర్ట్స్ కోటా టీచర్లపై వైకాపా నేతల దాడిని ఏపీ సీఎం చంద్రబాబు ఖండించారు. ఫేక్ పార్టీ అందరినీ ఫేక్ అంటే సహించేది లేదన్నారు. “విజయవాడలో గురువులపై రౌడీలు దాడి చేస్తున్నారు. టీచర్లపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోం. కఠిన చర్యలు తీసుకుంటాం. సాక్షి రిపోర్టర్.. టీచర్‌పై దాడి చేశారంటే వైకాపా ఎంత బరితెగించిందో అర్థం చేసుకోండి. అసెంబ్లీకి వచ్చి చర్చిస్తే సాక్ష్యాధారాలతో నోళు మూయిస్తాం. చట్టబద్ధ ప్రక్రియపై కోర్టుకు వెళ్లొచ్చు.. కానీ దాడులేంటి? ఉపాధ్యాయులపై రౌడీలను ఎగదోయడమేంటి? గత పాలనలో పాలకులే రౌడీయిజం చేశారు.. దారుణాలకు పాల్పడ్డారు. కుప్పం వస్తే నన్ను కూడా ఇబ్బంది పెట్టారు. దౌర్జన్యాలకు దిగారు. రౌడీయిజం చేసేవారి తోక కత్తిరిస్తాం. రౌడీలు, విధ్వంసకారులను తరిమికొట్టే సత్తా కుప్పానికి ఉంది” అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# చాలా ఖరీదైన ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం

## క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తాం

మంత్రి పొంగులేటి

- ★ రాయదుర్గంలో మల్కంచెరువు వెనుక 2.85 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన
- ★ “బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు పేదలను పట్టించుకోలేదు
- ★ అధికారం పోయాక.. పేదల వద్దకు వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారు



రాయదుర్గం: క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులందరికీ ఇల్లు వచ్చేవరకు ఈ పథకం విడతల వారీగా కొనసాగుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గంలో మల్కంచెరువు వెనుక 2.85 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మిగతా 2 లో

## యుద్ధ మేఘాల నీడలో ఐరాస భేటీ.. మోదీ, జిన్‌పింగ్, పుతిన్ గైర్హాజరు



యుద్ధాల నడుమ ఐరాస ఉన్నత స్థాయి సమావేశాలు

ఈ భేటీకి ప్రధాని మోదీ, చైనా, రష్యా అధ్యక్షులు గైర్హాజరు

భారత్ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్ శనివారం ప్రసంగం

ఈసారి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రమాదాలపై ప్రధానంగా చర్చ

అసలైన చర్చలు తెరవెనుక సమావేశాల్లోనే జరుగుతాయని వెల్లడి

ఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో తీవ్రమైన యుద్ధాలు, ఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి



## జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి బీఆర్ఎస్సే కారణం: జూపల్లి

- హయాంలో జూరాల దగ్గర అదనపు రిజర్వాయర్ ఎందుకు నిర్మించలేదు
- వరద లేని పరిస్థితుల్లో గేట్లు ఎత్తితే తాగునీటికి ఇబ్బంది కాదా?
- “కేసీఆర్ గతంలో 20 టీఎంసీల గట్టు రిజర్వాయర్‌ను తీసుకొస్తామని చెప్పారు
- జూరాల, భీమా ఆయకట్టుకు సింగోటం నుంచి నీళ్లు తెస్తామన్నారు
- కేసీఆర్ హయాంలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 30 శాతానికి మించలేదు

## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం.. మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్



- స్పోర్ట్స్ కోటా టీచర్లపై దాడికి దిగారంటూ లోకేశ్ ఆగ్రహం
- దైవం వంటి గురువులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- దేశానికి పన్నె తెచ్చిన క్రీడాకారులను జగన్ అవమానిస్తున్నారని ఆరోపణ
- రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని విమర్శ
- ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి రావొద్దని హితవు



## పోఖ్రాన్ ఆంక్షల తర్వాత మళ్లీ.. భారత్‌పై అమెరికా సుంకాల కత్తి

రష్యా చమురు దిగుమతి చేసుకునే దేశాలపై అమెరికా కొత్త చట్టం

ఈ చట్టంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం

భారత్ నుంచి వచ్చే వస్తువులపై 100శాతం వరకు సుంకాలు విధించే అవకాశం

25 ఏళ్ల క్రితం నాటి పోఖ్రాన్ ఆంక్షల తరహా పరిస్థితులు పునరావృతం అవుతాయనే ఆందోళన

దేశ ఇంధన భద్రతే తమకు ముఖ్యమని స్పష్టం చేసిన భారత ప్రభుత్వం

## రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?

# రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

ఎండిపోతున్న పంటలకు నీళ్లివ్వాలని కోరిన రైతులను అరెస్ట్ చేశారన్న కేటీఆర్

- రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ఆగ్రహం
- బీఆర్ఎస్ నేతలను అక్రమంగా నిర్బంధించారని ఆరోపణ
- సీఎం రేవంత్ రెడ్డిది రాక్షస మనస్తత్వమంటూ తీవ్ర విమర్శ



హైదరాబాద్: ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, మిగతా 2 లో

## టీచర్లపై దాడి నిందితులను వదిలిపెట్టం..

### మంత్రి లోకేశ్ మాస్ వార్నింగ్

అమరావతి: విజయవాడలో స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లపై దాడికి వైసీపీ ముఠాలు దాడికి దిగాయంటూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీపై తీవ్ర ఆరోపణలు చేస్తూ 'ఎక్స్'లో పోస్టు చేశారు. క్రీడాకారులుగా దేశానికి పేరు తీసుకొచ్చిన వారికి అన్యాయం చేయడం సరికాదని అన్నారు. దైవంగా భావించే టీచర్లపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు జరిగాయంటూ ఫేక్ ఆరోపణలు చేసినప్పుడే జగన్ దుర్బుద్ధి బయటపడిందని లోకేశ్ విమర్శించారు. క్రీడల్లో ప్రతిభ చూపించి టీచర్ ఉద్యోగాలు సాధించిన వారిని అవమానిస్తోందని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ స్పోర్ట్స్ కోటా డీఎస్సీ-2025 టీచర్లు విజయవాడ క్యాంప్ కార్యాలయం వద్ద అధికారులను కలిశారని లోకేశ్ తెలిపారు. ఈ సమయంలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు టీచర్లపై దాడికి దిగారని ఆరోపించారు. రౌడీ షీటర్లు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లను టీచర్లపైకి ఉసిగొల్పారని లోకేశ్ ఆరోపించారు. గురువులపై రాడ్లు, కర్రలతో దాడి చేయడం దారుణమని అన్నారు. టీచర్లపై దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని లోకేశ్ స్పష్టం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, టీచర్ల జోలికి వైసీపీ రావడం మానుకోవాలని సూచించారు.

## ఏపీలో జూడాలకు గుడ్ న్యూస్ చెప్పిన కూటమి ప్రభుత్వం

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పనిచేస్తున్న జూనియర్ డాక్టర్లు, హౌస్ సర్జన్లకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వారి స్టైఫండ్‌ను పెంచుతూ సోమవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన స్టైఫండ్ 2026 జనవరి 1వ తేదీ నుంచి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ.34.08 కోట్ల అదనపు భారం పడనుంది. వివరాల్లోకి వెళితే, తమ పనిభారానికి తగినట్లుగా స్టైఫండ్ పెంచాలని జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ (జూడా) కొంతకాలంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారి డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని స్టైఫండ్ పెంపునకు ఆమోదం తెలిపింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, ఎంబీబీఎస్, బీడీఎస్ హౌస్ సర్జన్లకు 10 శాతం స్టైఫండ్ పెంచారు. దీంతో వారి నెలవారీ స్టైఫండ్ రూ.28,497కి చేరింది. అదేవిధంగా, పీజీ డిగ్రీ, డిప్లొమా కోర్సులు చేస్తున్న వైద్య విద్యార్థులకు 5 శాతం, సూపర్ స్పెషాలిటీ కోర్సులు అభ్యసిస్తున్న వారికి 3.5 శాతం చొప్పున స్టైఫండ్‌ను పెంచారు. ఈ పెంపు నిర్ణయం ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడిసిన్, సూపర్ స్పెషాలిటీ, ఎండీఎస్, డీఎన్‌బీ విద్యార్థులందరికీ వర్తిస్తుంది. జూనియర్ డాక్టర్ల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల వైద్య విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### రైతులకు నీళ్లివ్వమంటే అరెస్టులా?

## రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్: ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు జూరాల ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టిన రైతులను, బీఆర్ఎస్ నేతలను అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాల్సింది పోయి, బీఆర్ఎస్ శ్రేణులను అణచివేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, వందలాది మంది రైతులను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఈ అరెస్టులకు పాల్పడుతున్నారని, ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని ఆయన తీవ్రంగా విమర్శించారు. జూరాల ప్రాజెక్టులో 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను కాపాడుకోవడానికి ప్రాజెక్టు గేట్లు ఎత్తేందుకు ప్రయత్నించిన రైతులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. రైతుల ప్రాజెక్టు వద్దకు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేసి, భారీగా పోలీసులను మోహరించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ నేతలను, రైతులను వెంటనే విడుదల చేసి, జూరాల ఆయకట్టుకు తక్షణమే సాగునీరు అందించాలని కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## చెబితే నేనే భోజనం పెట్టి పొలం చూపించేవాడ్ని: హరీశ్ రావు

హైదరాబాద్: సిద్దిపేటలోని తన భూములను పరిశీలించేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు ఆసక్తికర ఆహ్వానం పలికారు. తనకు ముందే సమాచారం అందించి ఉంటే, తానే స్వయంగా అన్ని ఏర్పాట్లు చేసి, వారికి భోజనం పెట్టి మరీ తన పొలాన్ని చూపించేవాడినని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తన భూములను పరిశీలించేందుకు కాంగ్రెస్ నేతలు మూడు జిల్లాల నుంచి సుమారు 3,000 మంది పోలీసుల బందోబస్తుతో వస్తున్నారన్న వార్తలపై హరీశ్ రావు స్పందించారు. "ప్రేమ, ఆప్యాయతలు, ఆతిథ్యానికి సిద్దిపేట పెట్టింది పేరు. అటువంటి ప్రాంతానికి రావడానికి ఇంత భయమెందుకు? ఇంత భారీ స్థాయిలో పోలీసు బలగాలతో రావాల్సిన అవసరం లేదు" అని ఆయన వ్యాఖ్యానించారు. తన జీవితం ఒక తెరిచిన పుస్తకమని స్పష్టం చేసిన హరీశ్ రావు, తన ఆస్తులను పరిశీలించి ప్రజలకు నిజాలు చెప్పాలని కాంగ్రెస్ నేతలను కోరారు. తాను ఎన్నడూ భూకబ్జాలకు పాల్పడలేదని, ప్రజాధనాన్ని దోచుకోలేదని స్పష్టం చేశారు. తన ఆస్తుల వివరాలన్నీ ఎన్నికల అఫిడవిట్‌లో స్పష్టంగా ఉన్నాయని, వాటిని గమనించిన ప్రజలు తనను ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని ఆయన గుర్తుచేశారు.

### 45 గంటలు.. నాలుగు రాకెట్లు.. 30 ఉపగ్రహాలు..

## అంతరిక్షం రంగంలో చైనా దూకుడు

ఢిల్లీ: చైనా అంతరిక్ష రంగంలో దూకుడు పెంచుతోంది. కేవలం 45 గంటల వ్యవధిలో నాలుగు రాకెట్లను విజయవంతంగా ప్రయోగించింది. మూడు వేర్వేరు ప్రయోగ కేంద్రాల నుంచి ఈ ప్రయోగాలు జరిగాయి. సెప్టెంబర్ 15, 16 తేదీల్లో చేపట్టిన ఈ ప్రయోగాల్లో ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేట్ కంపెనీల రాకెట్లు కూడా ఉన్నాయి. మొదటి ప్రయోగం సెప్టెంబర్ 15న జియుక్వాన్ ఉపగ్రహ ప్రయోగ కేంద్రం నుంచి జరిగింది. ల్యాండ్‌స్పేస్ సంస్థకు చెందిన జుక్‌వూ-2ఈ రాకెట్ 10 ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. క్వియాన్‌ఫాన్ బ్రాడ్‌బ్యాండ్ మెగా శాటిలైట్ నెట్‌వర్క్ కోసం వీటిని పంపారు. ఈ నెట్‌వర్క్‌లో భవిష్యత్తులో దాదాపు 15 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టాలని చైనా లక్ష్యంగా పెట్టుకుంది. అదే రోజు షాంఘై సముద్ర తీరంలోని మొబైల్ ప్లాట్‌ఫామ్ నుంచి ఒరియెన్స్‌పేస్ గ్రావిటీ-1 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. ఇది మరో తొమ్మిది క్వియాన్‌ఫాన్ ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. ఘన ఇంధనంతో పనిచేసే ఈ రాకెట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన సాలిడ్ ఫ్యూయల్ రాకెట్‌గా గుర్తింపు పొందింది. మూడో ప్రయోగం హైనాన్ దీవిలోని వెన్‌చాంగ్ కేంద్రం నుంచి జరిగింది. ప్రభుత్వ రంగానికి చెందిన లాంగ్ మార్చ్-12 రాకెట్ తొమ్మిది ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపింది. ఇవి శాటిలైట్ పేరుతో ఏర్పాటు చేస్తున్న మరో భారీ బ్రాడ్‌బ్యాండ్ నెట్‌వర్క్ కోసం ఉద్దేశించినవి. ఇందులో దాదాపు 13 వేల ఉపగ్రహాలను ప్రవేశపెట్టే ప్రణాళిక ఉంది. నాలుగో ప్రయోగంతో ఈ వరుస ముగిసింది. జియుక్వాన్ నుంచి కుయ్‌జౌ-11 రాకెట్ రెండు రాడార్ భూ పరిశీలన ఉపగ్రహాలను కక్ష్యలోకి చేర్చింది. మొత్తంగా నాలుగు ప్రయోగాల్లో 30 ఉపగ్రహాలను చైనా కక్ష్యలోకి పంపింది. ఈ నాలుగు ప్రయోగాలు చైనా అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల పాత్ర పెరుగుతున్న విషయాన్ని కూడా చూపించాయి. ఇటీవల ఈ నాలుగు ప్రయోగాల్లో ఏ రాకెట్ బూస్టర్‌ను తిరిగి భూమికి తీసుకురాలేదు. కాగా, జుక్‌వూ-3, లాంగ్ మార్చ్-10బీ రాకెట్ల తొలి దశలను విజయవంతంగా ల్యాండ్ చేసి పునర్వినియోగ సాంకేతికతలో చైనా ముందడుగు వేసింది.

### యుద్ధ మేఘాల నీడలో ఐరాస భేటీ..

## మోదీ, జిన్‌పింగ్, పుతిన్ గైర్హాజరు



ఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో తీవ్రమైన యుద్ధాలు, ఘర్షణలు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ వార్షిక ఉన్నతస్థాయి సమావేశాలు ఈ వారం ప్రారంభం కానున్నాయి. ఈ కీలక భేటీకి 140 మంది ప్రపంచ నేతలు, మరో 53 దేశాల ప్రతినిధులు హాజరవుతున్నారు. గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తతలు, ఉక్రెయిన్ యుద్ధం, గాజాలో సంక్షోభం, సూడాన్‌లో కొనసాగుతున్న అంతర్యుద్ధం వంటి అంశాలు ఈ సమావేశాలపై తీవ్ర ప్రభావం చూపనున్నాయి. నేడు ఈ సమావేశాలు ప్రారంభం కానుండగా, సంప్రదాయం ప్రకారం బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డా సిల్వా తొలి ప్రసంగం చేయనున్నారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రసంగిస్తారు. అయితే, ఈసారి సమావేశాలకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వంటి ముగ్గురు కీలక నేతలు గైర్హాజరవుతున్నారు. భారత తరఫున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ శనివారం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 'విశ్వాసాన్ని పునరుద్ధరించడం, పరివర్తనను నిర్వహించడం: అందరి కోసం పనిచేసే ఐరాస' అనే థీమ్‌తో ఈ ఏడాది సమావేశాలు జరగనున్నాయి. వాతావరణ మార్పులు, ఉగ్రవాదం, ప్రపంచ ఆకలి, పేదరికం వంటి శాశ్వత సమస్యలతో పాటు ఈసారి కృత్రిమ మేధ (ఏఐ)తో ముంచుకొస్తున్న ప్రమాదాలపై కూడా ప్రపంచనాయకులు చర్చించనున్నారు. ఐరాస సర్వప్రతినిధి సభ అధ్యక్షుడిగా ఎన్నికైన బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఖలీలుర్ రెహమాన్ ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. ప్రధాన సభలో నేతల ప్రసంగాలు లాంఛనప్రాయంగా సాగినా, అసలైన చర్చలు, దౌత్యపరమైన మంతనాలు మాత్రం తెరవెనుక జరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. గత ఏడాది ఇలాంటి సమావేశాల సందర్భంగానే అమెరికా, కొన్ని ముస్లిం దేశాల మధ్య జరిగిన చర్చల ఫలితంగా గాజా శాంతి ప్రణాళిక రూపుదిద్దుకుందని ఆయన గుర్తుచేశారు. ఈ విషయంలో ఐరాస విశ్వసనీయతను ట్రంప్ కూడా విశ్వసించడం గమనార్హం. ఈ సమావేశాల్లో కొన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకోనున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగం చేసిన మరుసటి రోజే, ఆ దేశ ప్రత్యర్థి అయిన ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ ప్రసంగించనుండటం ఉత్కంఠ రేపుతోంది. మరోవైపు గాజాలో శాంతి చర్చలకు సమర్థించలేకపోతున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు గురువారం ప్రసంగించనున్నారు. పాలస్తీనా అధ్యక్షుడు మహమూద్ అబ్బాస్‌కు అమెరికా వీసా నిరాకరించడం వివాదాస్పదంగా మారింది.

# అభివృద్ధి, ఆర్థిక ప్రగతిలో కుప్పం దూసుకెళ్తోంది..!

మొదటి పేజి తరువాయి

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం నాయుడు,జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్,యు డి ఎ చైర్మన్ సురేష్ బాబు, లబ్ధిదారులు సురేఖ, సుబ్రహ్మణ్యం, విక్కీ విఘ్నేష్, వెంకటలక్ష్మి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 8,904 బంగారు కుటుంబాలను గుర్తించి వారికి పీ4 కార్యక్రమం ద్వారా సహకారం అందిస్తున్నాం. కుప్పాన్ని పేదరికం లేని నియోజకవర్గంగా మార్చటమే నా లక్ష్యం. కుప్పంలో ఎక్కడా చెత్త కనిపించకుండా చేయాలన్నది మా ఆలోచన.82 ప్రాసెసింగ్ కేంద్రాల ద్వారా కుప్పంలో చెత్త నుంచి కాంపోస్టు తయారు చేయిస్తున్నాం.నెట్ జీరో కుప్పంగా ఈ నియోజకవర్గాన్ని తయారు చేస్తాం.ఆస్పత్రి, కాలేజి, పాఠశాల, ప్రభుత్వ కార్యాలయం ఇలా అన్నీ నెట్ జీరో కావాలి. సోలార్ రూఫ్ టాప్ తో ప్రతీ ఇల్లూ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారాలి సంజీవని ప్రాజెక్టులో భాగంగా పౌరుల హెల్త్ రికార్డులను డిజిటలైజ్ చేస్తున్నాం... ఇదో గేమ్ ఛేంజర్. అందరి ఆరోగ్యాన్ని పరీక్షించేలా సంజీవని ప్రాజెక్టును తీర్చిదిద్దుతున్నాం. కుప్పంలో ఇప్పటికే వివిధ రకాల పరీక్షలను నిర్వహించి డిజిటల్ హెల్త్ రికార్డులను నమోదు చేసి చికిత్సలు అందిస్తున్నాం.13 పీహెచ్సీలు, ఏరియా ఆస్పత్రులతో 1.29 లక్షల మందికి కుప్పంలో సేవలు అందిస్తున్నాం. ఈ ఏడాది చివరి నాటికి రాష్ట్రంలోని 5 కోట్ల మంది ఆరోగ్యాన్ని పరిరక్షించేలా చర్యలు చేపడుతున్నాం. శ్రీవాణి ట్రస్టు రాష్ట్ర వ్యాప్తంగా 5 వేల దేవాలయాల నిర్మాణాన్ని చేపడుతున్నాం... కుప్పంలోనూ ఓ ఆలయాన్ని నిర్మిస్తాం. అర్హులందరికీ ఇళ్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ేప ద ల క ం పట్టాభిషేకం పేరుతో ఇల్లు - ఇంటి జాగా ఇచ్చేలా కార్యక్రమాలు చేపడుతున్నాం. కంగుందిలో దశాబ్దాల పాటు పరిష్కారం కాని భూ సమస్యను పరిష్కరించి 320 మందికి పట్టాలు ఇచ్చాం. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తరహాలో మీ భూమి- మీ హక్కు పేరిట రాజ ముద్రతో కూడిన పట్టాలు జారీ చేస్తున్నాం.

విజయాలను ప్రస్తావించిన సీఎం చంద్రబాబు

కష్టపడితే సొంత ప్రాంతంలోనే ఉపాధి పొందుతూ ఉన్నతంగా ఎదగవచ్చని, సృజనాత్మక ఆలోచనలతో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవచ్చని కుప్పం యువత నిరూపిస్తోంది. సోమవారం కుప్పం నియోజకవర్గ కేంద్రంలోని కొత్తపేటలో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముగ్గురు యువత సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ వారిని అభినందించారు.

సొంత ఊరిలోనే ఉద్యోగం.. సురేఖ సక్సెస్...

పొగురుపల్లికి చెందిన సురేఖ డిగ్రీ పూర్తి చేసిన అనంతరం స్థానికంగా ఏర్పాటైన అవీస్ కంపెనీలో పర్యవేక్షకురాలిగా ఉద్యోగం పొందారు. ఉద్యోగం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సొంత గ్రామానికి సమీపంలోనే ఉపాధి లభించడంతో తన తల్లిదండ్రులు కూడా ధైర్యంగా తనను ఉద్యోగానికి పంపుతున్నారని ఆమె ముఖ్యమంత్రితో తెలిపారు. ఉద్యోగం చేస్తూనే తన నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఎంబీఏ చదువుతున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని తెలిపారు. సురేఖ కథను ప్రస్తావించిన ముఖ్యమంత్రి.. స్థానికంగా పరిశ్రమలు రావడం వల్ల మహిళలు, యువతకు సొంత ప్రాంతంలోనే ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. యువత తమ నైపుణ్యాలను పెంచుకుని అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

యువ పారిశ్రామికవేత్తగా సుబ్రహ్మణ్యం..

కుప్పం ప్రాంతంలో వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించేలా పారిశ్రామిక కార్యకలాపాలను అభివృద్ధి చేస్తున్న సుబ్రహ్మణ్యం కృషిని కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఒకసారి విజయాన్ని సాధించిన తర్వాత అదే లక్ష్యంతో నిరంతరం కృషి చేస్తే మరింత ముందుకు వెళ్లవచ్చని అన్నారు. కుప్పం ప్రాంత వ్యవసాయ ఉత్పత్తులను దేశవ్యాప్తంగా మార్కెట్ చేసే స్థాయికి తీసుకెళ్లేందుకు స్థానిక యువ పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. "ఒక కుటుంబం--ఒక పారిశ్రామికవేత్త" అనే ఆలోచనను కుప్పం నుంచే ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. సుబ్రహ్మణ్యం వంటి యువత ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు.

సృజనాత్మకతతో సోషల్ మీడియాలో విక్కీ విఘ్నేష్..

కుప్పం అభివృద్ధిని సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళున్న యువకుడు విక్నేశ్ (విక్కీ) కృషిని కూడా ముఖ్యమంత్రి అభినందించారు. సృజనాత్మక ఆలోచనలతో వీడియోలు రూపొందిస్తూ కుప్పం అభివృద్ధి కార్యక్రమాలు, స్థానిక ప్రత్యేకతలను ప్రచారం చేస్తున్నారని తెలిపారు. సోషల్ మీడియా ప్రచారం ద్వారా విక్నేశ్ నెలకు సుమారు రూ.లక్ష వరకు ఆదాయం పొందుతున్నారని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వ్యక్తిగతంగా ఆదాయం సంపాదించడంతో పాటు తన ప్రాంత అభివృద్ధిని ప్రచారం చేయడం ద్వారా విక్నేశ్ రెండు విధాలుగా ప్రయోజనం చేకూరుస్తున్నారని అన్నారు.

### ముగ్గురి ప్రయాణం.. యువతకు సందేశం..

సురేఖ ఉద్యోగం సాధించి ఉన్నత విద్యను కొనసాగిస్తుండగా.. సుబ్రహ్మణ్యం పారిశ్రామిక రంగంలో తనకంటూ గుర్తింపు తెచ్చుకునే దిశగా ముందుకు సాగుతున్నారు. విక్నేశ్ సృజనాత్మకతను ఉపాధిగా మార్చుకుని, అదే సమయంలో కుప్పం అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళున్నారు. వీరి విజయాలు యువతకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయని కార్యక్రమంలో పేర్కొన్నారు. ఉద్యోగం కోసం ఎదురుచూడటమే కాకుండా.. నైపుణ్యాన్ని పెంచుకోవడం, వ్యాపార ఆలోచనలను ఆచరణలో పెట్టడం, సృజనాత్మకతతో కొత్త అవకాశాలను సృష్టించుకోవడం ద్వారా స్వయం ఉపాధితో పాటు మరెందరికో ఉపాధి కల్పించవచ్చనే విషయాన్ని ఈ ముగ్గురి విజయాలు చాటుతున్నాయి. కుప్పం యువతలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు, వారికి ఉపాధి, పారిశ్రామిక, నైపుణ్యాభివృద్ధి అవకాశాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి తెలిపారు.

### పోఖ్రాన్ ఆంక్షల తర్వాత మళ్లీ..

## భారత్‌పై అమెరికా సుంకాల కత్తి

ఢిల్లీ: భారత్-అమెరికా వ్యూహాత్మక, వాణిజ్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా నుంచి అధిక మొత్తంలో ముడి చమురు, సహజ వాయువు దిగుమతి చేసుకునే దేశాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలు కల్పించే బిల్లుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం నిబంధనలు పాటించని దేశాల నుంచి వచ్చే వస్తువులపై 100శాతం వరకు భారీ సుంకాలు (టారిఫ్‌లు) విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి లభిస్తుంది. ఈ పరిణామం రష్యా నుంచి అత్యధికంగా చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలపై తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. దివంగత సెనేటర్ లిండ్సే గ్రాహం పేరు మీద "లిండ్సే ఒ. గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026" పేరుతో ఈ చట్టాన్ని రూపొందించారు. అమెరికా సెనేట్, ప్రతినిధుల సభలో ఈ బిల్లుకు డెమొక్రాట్లు, రిపబ్లికన్లు అనే తేడా లేకుండా ఉభయపక్షాల మద్దతు లభించింది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన 30 రోజుల్లోగా రష్యా నుంచి ముడి చమురు లేదా గ్యాస్ కొనుగోలు చేస్తున్న మొదటి ఐదు దేశాలలో ఒకటిగా ఉండి, తమ దిగుమతులను తగ్గించుకోని పక్షంలో ఆ దేశంపై సుంకాలు విధించేందుకు అధ్యక్షుడికి అధికారం ఉంటుంది. గత కొన్నేళ్లుగా భారత్, రష్యా నుంచి చౌక ధరలకు లభించే ముడి చమురును భారీగా కొనుగోలు చేస్తోంది. కొన్ని నెలల్లో అయితే, భారత్ మొత్తం చమురు దిగుమతుల్లో సగానికి పైగా రష్యా నుంచే రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో అమెరికా తాజా చట్టం భారత్‌ను నేరుగా లక్ష్యం చేసే ప్రమాదం ఉంది. ఈ పరిణామంపై భారత అధికారులు స్పందిస్తూ, దేశ ప్రజల ఇంధన భద్రతకే తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. మార్కెట్‌లో లభ్యత, అందుబాటు ధర, ఇతర పరిస్థితులను బట్టే చమురు కొనుగోళ్లపై నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. అయితే, ఈ కొత్త చట్టం వల్ల ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలపై ప్రభావం పడే అవకాశం ఉందని భారత విదేశాంగ శాఖ అభిప్రాయపడింది. దాదాపు 25 ఏళ్ల క్రితం 1998లో భారత్ నిర్వహించిన పోఖ్రాన్-II అణు పరీక్షల అనంతరం అప్పటి అమెరికా ప్రభుత్వం కఠిన ఆంక్షలు విధించింది. ఆ తర్వాత జార్జ్ డబ్ల్యూ. బుష్ హయాంలో ఆ ఆంక్షలను ఎత్తివేశారు. ఇప్పుడు మళ్లీ ఇన్నేళ్ల తర్వాత అమెరికా నుంచి ఇలాంటి కఠినమైన వాణిజ్యపరమైన చర్యల ముప్పు పొంచి ఉండటం వ్యూహాత్మక, వాణిజ్య వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కొత్త చట్టం ఇరు దేశాల మధ్య నెలకొన్న బలమైన భాగస్వామ్యానికి కొత్త పరీక్షగా నిలవనుంది.

### చాలా ఖరీదైన ప్రాంతాల్లో

## ఇళ్లు నిర్మించి ఇస్తున్నాం.. మంత్రి పొంగులేటి




రాయదుర్గం: క్యూర్ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో లక్ష ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అర్హులందరికీ ఇల్లు వచ్చేవరకు ఈ పథకం విడతల వారీగా కొనసాగుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని రాయదుర్గంలో మల్కంచెరువు వెనుక 2.85 ఎకరాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇల్లు కేటాయింపు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. "బీఆర్ఎస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు పేదలను పట్టించుకోలేదు. అధికారం పోయాక.. పేదల వద్దకు వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారు. గత ప్రభుత్వం నగరానికి దూరంగా.. ప్రజలు ఉండలేని చోట ఇళ్లు నిర్మించింది. మేం రద్దీగా ఉండే, చాలా ఖరీదైన ప్రాంతాల్లో టవర్స్ నిర్మించి, ఇళ్లు ఇస్తున్నాం. పేదలయితే చాలు.. ఏ పార్టీ వారు అని చూడకుండా ఇల్లు మంజూరు చేస్తున్నాం. వచ్చే నెల రోజుల్లో ప్రతి నియోజకవర్గంలో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం ప్రారంభిస్తాం" అని తెలిపారు.

ఎల్3 కేటగిరీపై కీలక నిర్ణయం

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి విచారణలో అనర్హులుగా తేలిన వారిని అధికారులు ఎల్3 కేటగిరీలో పెట్టిన విషయం తెలిసిందే. అయితే.. ఎల్3 కేటగిరీలో ఉన్నప్పటికీ ఇల్లు నిర్మాణం ప్రారంభించినవారికి ప్రత్యేక అనుమతి ఇవ్వనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఎల్3లో ఉన్నప్పటికీ.. బేస్‌మెంట్ పూర్తయిన ఇళ్లకు నిధులు మంజూరు చేస్తామన్నారు. ఇళ్లు మంజూరై నిర్మాణం ప్రారంభం కాని అనర్హులకు రద్దు చేస్తామని పేర్కొన్నారు. ఎల్3 కేటగిరీలోని అనర్హులకు రద్దు చేసి అర్హులకు ఇవ్వాలని నిర్ణయించినట్లు చెప్పారు.

### జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి

## బీఆర్ఎస్సే కారణం: జూపల్లి




జూరాల: జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వలేకపోవడానికి బీఆర్ఎస్సే కారణమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జూరాల దగ్గర అదనపు రిజర్వాయర్ ఎందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాలలో ఆయన ఈమేరకు మాట్లాడారు. వరద లేని పరిస్థితుల్లో గేట్లు ఎత్తితే తాగునీటికి ఇబ్బంది కాదా? అని ప్రశ్నించారు. "కేసీఆర్ గతంలో 20 టీఎంసీల గట్టు రిజర్వాయర్‌ను తీసుకొస్తామని చెప్పారు. జూరాల, భీమా ఆయకట్టుకు సింగోటం నుంచి నీళ్లు తెస్తామన్నారు. పాలమూరుపై అంత ప్రేమ ఉంటే రిజర్వాయర్లను ఎందుకు నిర్మించలేదు? కేసీఆర్ రిజర్వాయర్లు కట్టకపోవడం వల్లే నీళ్లను నిల్వ చేసుకోలేకపోతున్నాం. పాలమూరు జిల్లాను ఎండబెట్టే ప్రయత్నం చేశారు. కేసీఆర్ హయాంలో కృష్ణా నీటిలో తెలంగాణ వాటా 30 శాతానికి మించలేదు. మా ప్రభుత్వంలో ఈ వాటా 43 శాతం వరకు ఉంది. నీటి కేటాయింపుల విషయంలో కాంగ్రెస్ సర్కారు రాజీపడదు. 15 టీఎంసీలతో గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి నిధులు ఇచ్చాం. ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి ఇంకా నీళ్లు వస్తాయని భావిస్తున్నాం. ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లను సరైన పద్ధతిలో ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తున్నాం. వచ్చే సీజన్‌కు నీటి ఎద్దడి లేకుండా చేస్తాం" అని అన్నారు.

### కుప్పంలో సీఎం చంద్రబాబు సుడిగాలి పర్యటన..

## వందల కోట్ల పనులకు శ్రీకారం




అమరావతి: తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించిన సీఎం చంద్రబాబు నాయుడు, నియోజకవర్గాన్ని 'స్వర్ణ కుప్పం'గా తీర్చిదిద్దే దిశగా వందల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఒకే రోజు పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలతో ఆయన పర్యటన బిజీబిజీగా సాగింది. పర్యటనలో భాగంగా రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆర్డీఓ, ఏఎస్పీ కార్యాలయాల భవనాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కుప్పం మున్సిపాలిటీలో రూ.38 కోట్ల విలువైన వివిధ ప్రభుత్వ పనులకు భూమిపూజ నిర్వహించారు. రూ.3.30 కోట్లతో పూర్తిచేసిన సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను, మెటీరియల్ రికవరీ కేంద్రాన్ని ప్రారంభించారు. మల్లనూరులో 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.2.70 కోట్లతో చేపట్టనున్న జూనియర్ కళాశాల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. దీంతోపాటు వ్యవసాయ ఫీడర్ల కోసం ఉద్దేశించిన 15 మెగావాట్ల పీఎం కుసుమ్ సోలార్ ప్రాజెక్టులను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యమే శ్రీరామరక్ష.. రైతులకు సీఎం పిలుపు

అనంతరం 'స్వర్ణ కుప్పం' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న చంద్రబాబు, పలువురు లబ్ధిదారులతో నేరుగా సంభాషించారు. హంద్రీనీవా కాలువ ద్వారా లబ్ధి పొందిన రైతుతో మాట్లాడుతూ.. వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని హితవు పలికారు.

"వాతావరణ సమతుల్యం దెబ్బతినడం వల్లే ఎల్ నినో వంటి పరిస్థితులు ఏర్పడి వర్షాభావం నెలకొంది. దీనివల్ల కృష్ణా, గోదావరి నదులకు నీరు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సేంద్రీయ ఎరువులు, బయోచార్ వంటి విధానాలతో భూసారాన్ని పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం. ప్రకృతి సేద్యం శ్రీరామరక్ష అనే విధానాన్ని పాటిద్దాం" అని రైతులకు పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మంది ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని, ఈ సంఖ్యను మరింత పెంచుదామని అన్నారు. భూములను ఖాళీగా ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలు వేయాలని సూచిస్తూ, కరవు నివారణకు దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి ఇంటికో పారిశ్రామికవేత్త

ఈ సందర్భంగా పీ4 కార్యక్రమం కింద లబ్ధి పొందిన లక్ష్మి అనే మహిళ తన అనుభవాలను పంచుకున్నారు. ప్రభుత్వం, టీవీఎస్ సంస్థ సహకారంతో ఇటుకల బట్టీ ఏర్పాటు చేసుకుని పారిశ్రామికవేత్తగా మారానని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన చంద్రబాబు.. "ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త తయారు కావాలన్నదే మా కూటమి ప్రభుత్వ లక్ష్యం" అని స్పష్టం చేశారు. టీవీఎస్, అదానీ, మెగా వంటి సంస్థలు 8900 కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థికంగా నిలబెడుతున్నాయని అభినందించారు. అలాగే, కుప్పంలోని ఓ కంపెనీలో ఉద్యోగం పొందిన సురేఖ అనే యువతిని అభినందిస్తూ, ప్రతి కుటుంబంలోనూ స్టార్టప్‌లు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు రావాలని ఆకాంక్షించారు.

### రామ మందిరంలో భారీ కుంభకోణం

## 105 సార్లు విరాళాల చోరీ



ఢిల్లీ: అయోధ్య రామ మందిరంలో భక్తులు సమర్పించిన విరాళాల చోరీకి సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆలయంలో ఏకంగా 105 సార్లు విరాళాల అపహరణ జరిగినట్లు సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నిర్ధారించింది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టుకు సిట్ తన నివేదికను సమర్పించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ కేసుకు సంబంధించిన సిట్ నివేదికలోని కీలక అంశాలను ధర్మాసనం ముందుంచారు. సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను విశ్లేషించి నిందితులను గుర్తించినట్లు ఆయన తెలిపారు. సాధారణంగా విరాళాలకు సాఫ్ట్‌వేర్ ద్వారా రశీదులు జారీ చేసి, ఆ నగదును స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్‌లో భద్రపరుస్తారు. అయితే, ఈ ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగినట్లు దర్యాప్తులో తేలింది. ప్రస్తుతం దర్యాప్తు తుది దశకు చేరుకుందని, సెప్టెంబర్ 25 నాటికి ఛార్జిషీట్ దాఖలు చేసే అవకాశం ఉందని మెహతా కోర్టుకు వివరించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎనిమిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవకుశ్ మిశ్రా, మనీశ్ కుమార్ యాదవ్, కరుణేశ్ పాండే, రామాశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ, రామ్ శంకర్ యాదవ్ ఉన్నారు. నిందితులపై భారతీయ న్యాయ సంహితతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. విరాళాల దుర్వినియోగంపై ఆరోపణలు వెలుగులోకి రావడంతో రామ్ మందిర్ ట్రస్టులో కీలక మార్పులు చేశారు. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలు తప్పుకున్న అనంతరం, ఆలయ పరిపాలన కోసం సీఈఓ నేతృత్వంలో కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశారు. రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రాను నూతన సీఈఓగా నియమించారు. కాగా, సిట్ నివేదిక ప్రతిని తమకు అందజేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

## పామాయిల్ తోటల్లో కరెంట్ లైన్లు మార్చాలి

: పులి శ్రీరాములు వినతి



ఏలూరు, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: పామాయిల్ తోటల మీదుగా వెళ్తున్న కరెంట్ లైన్లను మార్చాలని ప్రభుత్వ పురస్కార గ్రహీత పులి శ్రీరాములు విజ్ఞప్తి చేశారు. కరెంట్ తీగల కారణంగా ఇటీవల పామాయిల్ గెలల కోత సమయంలో జిల్లాలో 20 మంది పైగా కూలీలు విద్యుత్ ఘాతంతో మరణించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పామాయిల్ రైతులకు అనేక ప్రోత్సాహకాలు ఇస్తున్న కూటమి ప్రభుత్వం కరెంట్ స్తంభాలను, రైతుల పై భారం పడకుండా ప్రభుత్వ ఖర్చుతో మార్చాలని పులి శ్రీరాములు కోరారు. ఎల్ నినో కారణంగా మెట్ట రైతుల భూగర్భ జలాలు అడుగంటి నీరందక పంటలు మోటార్లు కాలిపోయిలు విధాలుగా నష్టపోయారని బోరు బావులు ఇంకా 100 అడుగులు లోతు పైగా బోర్లు వేయాలని, 5 ఎకరాల లోపు ఉన్న రైతుల తోటలకు ప్రభుత్వం మే బోర్లు తవ్వించి ఆదుకోవాలని పులి శ్రీరాములు కోరారు.

## 23న ఒంగోలు నగరంలో శ్రీగిరి గిరిప్రదక్షిణ

- భక్తులు పాల్గొని శ్రీవారి కృపకు పాత్రులు కావాలి
- శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ విజ్ఞప్తి



ఒంగోలు, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: భాద్రపద మాసం శుక్ల ద్వాదశి, సెప్టెంబర్ 23వ తేదీ బుధవారం శ్రీవేంకటేశ్వర స్వామివారి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో శ్రీగిరి గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, శోభాయమానంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 5 గంటలకు శ్రీగిరి పాదపీఠం వద్ద ఉన్న శ్రీ బాపూజీ గోశాలలో గోపూజ నిర్వహించనున్నారు. అనంతరం భక్తులందరూ సామూహికంగా గోవింద నామస్మరణ చేస్తూ, సుందరంగా అలంకరించిన పల్లకిలో శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులను వేంచేపు చేయనున్నారు. భక్తులు తమ భుజస్కంధాలపై పల్లకిని మోస్తూ ఒంగోలు నగరంలో శ్రీగిరి గిరిప్రదక్షిణ నిర్వహించనున్నారు. ఈ మహిమాన్వితమైన రోజున భక్తులు సకుటుంబ సపరివార సమేతంగా పాల్గొని, సామూహికంగా శ్రీవారి నామస్మరణ చేస్తూ శ్రీగిరి గిరిప్రదక్షిణలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. స్థానిక శ్రీగిరి గిరిప్రదక్షిణ కమిటీ కార్యాలయంలో అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ, శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణ నక్షత్రం రోజున భక్తి ప్రపత్తులతో సామూహికంగా శ్రీగిరి గిరిప్రదక్షిణ చేసి శ్రీవారిని దర్శించుకోవడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యానికి మేలు చేకూరుతుందని తెలిపారు. అలాగే హిందూ సంప్రదాయాలపై అవగాహన పెంపొందడంతో పాటు భక్తుల మధ్య ఐక్యత మరింత బలపడుతుందని వివరించారు. ఈ సమావేశంలో కమిటీ గౌరవ అధ్యక్షులు చలువాది బద్రీనారాయణ, అధ్యక్షులు రాధా రమణ గుప్తా జంధ్యం, ఉపాధ్యక్షులు దాసరి నారాయణరావు, తూనుగుంట్ల మల్లికార్జునరావు, కార్యదర్శి త్రిపురం మల్లికార్జునరావు, సహకార్యదర్శి నేరెళ్ల శ్రీనివాసరావు, కోశాధికారి వలేటి కృష్ణారావుతో పాటు సభ్యులు నూనె రామాంజనేయులు, చలువాది బ్రహ్మయ్య, కనమర్లపూడి బాలకోటేశ్వరరావు, ధనిశెట్టి రాముసాయుడు, నల్లమల్లి కోటి సూర్యనారాయణ పాల్గొన్నారు.

## ఏపీలో అక్టోబర్ 12 నుంచి స్కూళ్లకు దసరా సెలవులు

విజయవాడ, సెప్టెంబర్ 21 నేటి శుభోదయ: ఏపీలోని పాఠశాలలకు అక్టోబర్ 12 నుండి 21 వరకు 10 రోజులు దసరా సెలవులు ప్రకటించారు. అయితే, రెండో శనివారం, ఆదివారం కలిసి రావడంతో అక్టోబర్ 10 నుంచే సెలవులు ప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 22న పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి. క్రిస్టియన్ ఎయిడెడ్ పాఠశాలలకు క్రిస్మస్ సెలవుల కారణంగా షెడ్యూల్లో స్వల్ప మార్పులు ఉంటాయని తెలిపింది.

## గుడిసెలో నుండి మెడికల్ కాలేజీకి

- మట్టి లో మాణిక్యం ఎంబీబీస్ సీటు సాధించిన సాయి వరుణ్



ఖమ్మం, తిరుమలాయపాలెం సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: పేదరికం లో పుట్టి చిన్న వయస్సు లోనే తండ్రిని కోల్పోయిన (బుడిగం శ్రీలత వెంకటేశ్వర్లు కుమారుడు) బుడిగం సాయి వరుణ్ వెనకడుగు వేయకుండా అమ్మమ్మ అల్లి యశోద దగ్గర ఉంటూ బాల్య విద్యాభ్యాసం రఘునాథపాలెం ప్రభుత్వ పాఠశాలలో చదివి అనంతరం ఏన్కూర్ గురుకులంలో సెకండరీ ఎడ్యుకేషన్ పూర్తి చేసి 2025- 2026 ఎంసెట్ లో 2088 ర్యాంక్ తో వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎం బిబిఎస్ లో సీటు సాధించాడు. విషయం తెలుసుకున్న జేఏసీ చైర్మన్ మందడి ఇజ్రాయిల్ సాయి వరుణ్ ని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దిగ్విజయంగా ఎంబీబీస్ పూర్తి చేసి నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. గ్రామ పెద్దలు మల్లయ్య,తక్కెళ్లపల్లి నరేందర్ రావు, య బ్రబోయిన వెంకన్న, కోంద్రు మహేష్ సాయి వరుణ్ ని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎనిమిదో రోజుకు చేరుకున్న గణపతి నవరాత్రి మహోత్సవాలు

-శ్రీ లక్ష్మీ గణపతి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చిన స్వామివారు



గుడివాడ, సెప్టెంబర్ 21 నేటి శుభోదయ: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన మెయిన్ రోడ్డు లోని శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో గణపతి నవరాత్ర మహోత్సవాలు ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. శ్రీ లక్ష్మీ గణపతి అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారికి వేద పండితులు విశేష పూజలు చేశారు. ఉత్సవాల తొమ్మిదో రోజు మంగళవారం శ్రీ శేష గణపతి అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తారని ఆలయ కమిటీ చైర్మన్ సాయన రాజేష్, ఈవో యార్లగడ్డ వాసు తెలిపారు. 22వ తేదీ మంగళవారం ఆలయ ప్రాంగణంలో లోక కళ్యాణార్థం శ్రీ లక్ష్మీ గణపతి హోమ పూజలు చేస్తున్నట్లు రాజేష్, వాసు తెలిపారు. ఉత్సవ వేడుకల్లో కమిటీ సభ్యులు , లోయ వాసు, పంచుమర్తి శ్రీనివాసరావు, ముళ్ళపూడి రమణమూర్తి, విక్కుర్తి పోతురాజు, వీరమాచినేని శైలజ, చాపరాల విజయలక్ష్మి, సోసుపల్లి శారద, గొంతుపల్లి కనకదుర్గ, గణపతి శాస్త్రి, దేవస్థాన సిబ్బంది నారాయణ పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గుడివాడలో రూ.76 కోట్ల అమృత్ 2.0 పనులపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమీక్ష

-ప్రజా వేదికలో మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే

-ధనియాలపేట, ఆర్టీసీ కాలనీల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల పనులు నత్తనడకన సాగుతున్నాయని అసంతృప్తి -అభివృద్ధి పనుల డిజైన్ల రూపకల్పనలో జాప్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం....వారంలో ఫైనల్ చేయాలని అల్టిమేటం

-రూ.33 కోట్లతో యూజీడీ నెట్వర్క్, సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ఏర్పాటు.

-రూ.22.50 కోట్లతో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, పైప్‌లైన్లు, పంప్‌హౌస్ అభివృద్ధి

-రూ.10.90 కోట్లతో టిడ్కో,ఎన్టీఆర్ సెంటు కాలనీల్లో తాగునీటి వసతులు

-రూ.5.60 కోట్లతో హెడ్ వాటర్ వర్క్స్ సామర్థ్యం పెంపు....రూ.4 కోట్లతో బేతవోలు, నాగవరప్పాడు చెరువుల పునరుద్ధరణ



గుడివాడ, సెప్టెంబర్ 21నేటి శుభోదయ: గుడివాడ పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద రూ.76 కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమీక్ష నిర్వహించారు. పనులు వేగవంతం చేయడంతో పాటు.. ప్రజలకు మెరుగైన తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్యం, డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గుడివాడలోని ప్రజా వేదిక కార్యాలయంలోశ్రీశ్రీ సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు. అమృత్ 2.0 నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన నమూనా డిజైన్లు, నిర్మాణ ప్రణాళికలను అధికారులు ఎమ్మెల్యే రాముకు వివరించారు. ఇప్పటికే ప్రారంభమైన అమృత్ అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని ఎమ్మెల్యే రాము అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ధనియాలపేట, ఆర్టీసీ కాలనీల్లో చేపడుతున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణ పనులు నత్తనడకన సాగడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల పనులను ప్రారంభించి.. వాటిని సకాలంలో పూర్తి చేయకపోతే ప్రభుత్వ లక్ష్యం నెరవేరదని ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు. పనుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, కాంట్రాక్టు సంస్థతో సమన్వయం చేసుకుని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర డిజైన్ల రూపకల్పనలో జరుగుతున్న జాప్యంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అవసరమైన సాంకేతిక అంశాలను పరిశీలించి.. వారంలోగా అన్ని డిజైన్లను ఫైనల్ చేయాలని స్పష్టం చేశారు. డిజైన్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి అభివృద్ధి పనికి సంబంధించి వారంలోగా స్పష్టమైన కన్స్ట్రక్షన్ షెడ్యూల్ రూపొందించాలని అధికారులకు సూచించారు. ఏ పని ఎప్పుడు ప్రారంభమవుతుంది.. ఎప్పుడు పూర్తవుతుంది అనే దానిపై స్పష్టత ఉండాలని ఎమ్మెల్యే రాము అన్నారు.

### అనంతరం ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ

గుడివాడ పట్టణంలో అమృత్ 2.0 పథకం కింద మొత్తం రూ.76 కోట్ల నిధులతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. గుడివాడ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయడంతో పాటు పట్టణంలో మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ పనులను చేపడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని.. ప్రజలకు శాశ్వత ప్రయోజనం కలిగేలా పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రూ.22.50 కోట్లతో గుడివాడ పట్టణంలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు, పైప్‌లైన్లు, పంప్‌హౌస్ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా రూ.10.90 కోట్లతో టిడ్కో, ఎన్టీఆర్ సెంటు స్థలాల లేఅవుట్ కాలనీల్లో ఓవర్ హెడ్ ట్యాంక్, డిస్ట్రిబ్యూషన్ నెట్వర్క్ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు రూ.33 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ ) నెట్వర్క్ అభివృద్ధి పనులతో పాటు సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే రాము వెల్లడించారు. అదేవిధంగా రూ.5.60 కోట్లతో గుడివాడ సమ్మర్ స్టోరేజ్ హెడ్ వాటర్ వర్క్స్ సామర్థ్యాన్ని పెంచే పనులు చేపడుతున్నామని తెలిపారు. పట్టణంలోని చెరువుల అభివృద్ధి, పునరుద్ధరణకు కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని.. ఇందులో భాగంగా రూ.4 కోట్లతో బేతవోలు, నాగవరప్పాడు చెరువుల పునరుద్ధరణ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఇప్పటికే ధనియాలపేట, ఆర్టీసీ కాలనీల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ నెల 23వ తేదీ బుధవారం బేతవోలు, నాగవరప్పాడు చెరువుల పునరుద్ధరణ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. గుడివాడ పట్టణ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అమృత్ 2.0 పనులను సమగ్ర ప్రణాళికతో ముందుకు తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే రాము అన్నారు. తాగునీరు, డ్రైనేజీ, చెరువుల అభివృద్ధి, మౌలిక వసతులు వంటి అన్ని అంశాలను సమన్వయం చేసుకుని పనులు చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పబ్లిక్ హెల్త్ ఇ .ఇ ప్రవీణ్,డి .ఇ పాండురంగ, మున్సిపల్ ఎం .ఇ సతీష్ చంద్ర, డి ఇ శివాజీ, ఏఇ లు రాజేష్, శ్రావణ్, శివాజీ, సత్యనారాయణ, మరియు మెగా సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## యుద్ధాలతో శాంతి కపోతం రక్తసిక్తం

- విజ్ఞాన్ లో ప్రపంచ శాంతి దినోత్సవం

ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: ప్రపంచవ్యాప్తంగా నేడు అశాంతి మేఘాలు కమ్ముకున్నాయని, రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయిల్ -పాలస్తీనా, అమెరికా - ఇరాన్ ల మధ్య సాగుతున్న యుద్ధాల కారణంగా వేలాది మంది అమాయకులు ప్రాణాలు కోల్పోతుండగా, లక్షలాది మంది శరణార్థులుగా తయారవుతున్నారని సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి సూర్యనారాయణ పేర్కొన్నారు. విజ్ఞాన్ విద్యాలయం లో సోమవారం నిర్వహించిన 'ప్రపంచ శాంతి దినోత్సవ' ప్రత్యేక సదస్సులో ఆయన ఉపన్యసిస్తూ యుద్ధాల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడమే కాకుండా, మానవాళి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతోందని, దీనితో ఆధునిక సమాజం తిరిగి ఆటవిక యుగలక్షణాలతో తిరోగమిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచవ్యాప్తంగా శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పడానికి ఐక్యరాజ్యసమితి 1981లో ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి ఏటా సెప్టెంబర్ 21న 'అంతర్జాతీయ శాంతి దినోత్సవం' జరుపుకుంటున్నామని తెలుపుతూ యుద్ధాలు కేవలం విధ్వంసానికి, పేదరికానికి, నిరుద్యోగానికి దారితీస్తాయని, ఆయుధాల పోటీని విడిచిపెట్టి, వాతావరణ మార్పులు, పేదరికం, ఆకలి చావుల వంటి నిజమైన సవాళ్లపై ప్రపంచ దేశాలు పోరాడాలని అన్నారు. విద్య, వైద్యం, మానవ హక్కుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత అంశాలుగా గుర్తించాలని, ?పరస్పర గౌరవం,సఖ్యత, స్నేహం, విశ్వమానవ సౌభ్రాతుత్వభావనతో కూడిన జీవన విధానమే ప్రపంచప్రగతికి మూలాధారమని, దీనికై ఐక్యరాజ్యసమితి చర్యలు తీసుకుని ప్రపంచశాంతి దిశగా వేగంగా అడుగులు వేయాలని పేర్కొంటూ 'కంటికి కన్ను అనే సిద్ధాంతాన్ని నమ్ముకుంటే చివరికి అందరూ గుడ్డివారిగా మిగిలిపోతారన్న' మహాత్మా గాంధీ మాటలు ఆధునికజీవన విధాన సూచికలని సూర్యనారాయణ పేర్కొన్నారు.

## గుడివాడలో ఘనంగా సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

-ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

-పేద,మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ అండగా నిలుస్తోంది

-గుడివాడ నియోజకవర్గంలో ఇప్పటివరకు రూ.7.50 కోట్ల చెక్కులు పంపిణీ చేశాం....వీటికి ఎల్ఓసిలు అదనం

-ప్రజల అవసరాలు గుర్తించి పనిచేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మద్దతుగా ఉండాలని విజ్ఞప్తి



గుడివాడ, సెప్టెంబర్ 21 నేటి శుభోదయ : అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గుడివాడ ఏలూరు రోడ్డులోని ప్రజావేదిక కార్యాలయంలో సోమవారం ఉదయం ఎమ్మెల్యే రాము ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకుల సమక్షంలో నియోజకవర్గ పరిధిలోని 72 బాధిత కుటుంబాలకు రూ.40 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను, కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ... గతంలో అనారోగ్య సమస్యలతో చికిత్స చేయించుకుంటూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ సహాయం పొందడం కష్టంగా ఉండేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సీఎంఆర్ఎఫ్ ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. గుడివాడ నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు రూ.7.50 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించామని ఎమ్మెల్యే రాము తెలిపారు. అనారోగ్యంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేరినప్పుడు వైద్య ఖర్చులు భరించడం ప్రతి సామాన్య కుటుంబానికి సవాలుగా మారుతుందని, ఆ కష్టాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా అర్హులైన వారికి సహాయం అందిస్తున్నారని అన్నారు. కష్టాల్లో ఉన్న ప్రజలకు ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతో, వారి అవసరాల సమయంలో ఆర్థిక సహాయం అందించేలా సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. పార్టీలకు అతీతంగా, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సహాయ కార్యక్రమాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. అన్ని వర్గాల్లోనూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు ఉంటాయని, అనారోగ్యం, వైద్య ఖర్చుల సమయంలో వారికి ప్రభుత్వ సహాయం ఎంతో అవసరమని ఎమ్మెల్యే రాము అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలిచే విధంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పనిచేస్తున్నారని తెలిపారు. కష్టకాలంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో బాధిత కుటుంబాలు ఎమ్మెల్యే రాముకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అందుతున్న సంక్షేమం, సహాయ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే రాము ఈ సందర్భంగా ప్రజలను కోరారు. చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబశివరావు, వాసే మురళి, దానేటి సన్యాసిరావు, పోలవరపు వెంకట్రావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, వైస్ చైర్మన్ గొర్రెపర్తి సుబ్బారావు,కార్పొరేషన్ డైరెక్టర్లు దింట్యాల రాంబాబు, మజ్జాడ నాగరాజు, బిజెపి నాయకులు అంగడాల సతీష్,టిడిపి నాయకులు లింగం ప్రసాద్, చేకూరు జగన్మోహన్రావు, శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానం కమిటీ చైర్మన్ ఈడే మోహన్, జనసేన నాయకులు పేర్ని జగన్, నియోజకవర్గ పరిధిలోని టిడిపి నాయకులు, గ్రామ, వార్డు పార్టీల అధ్యక్షులు, అనుబంధ విభాగాల నేతలు, బాధిత కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

## "జన హితం కోసమే జర్నలిజం నూతన ప్రెస్ క్లబ్ ఆవిర్భావ సభలో వక్తల అభిభాషణ

అధ్యక్ష, కార్యదర్శులుగా చిక్కాల రామకృష్ణ, మారంపూడి ఏసుదాసు ఎన్నిక

కీర్తిశేషులు వానపల్లి సుబ్బారావు విగ్రహం ఏర్పాటు చేయాలని, ఆయన పేరిట ఉత్తమ జర్నలిస్టు అవార్డు ఇవ్వాలని ప్రెస్ క్లబ్ తీర్మానం"



తాడేపల్లిగూడెం, సెప్టెంబర్ 21( నేటి-శుభోదయ) జనహితం కోసమే జర్నలిజమని,జర్నలిస్టుల సంక్షేమంతో పాటు సమాజ అభ్యుదయం కోసం తాము కృషి చేస్తామని నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిక్కాల రామ కృష్ణ అన్నారు. తాడేపల్లిగూడెం లో రీజనల్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఆర్.జె.యూ.)నూతన ప్రెస్ క్లబ్ ఆవిర్భావ సభ సోమవారం జరిగింది. స్థానిక ఎం. వి.ఆర్. కాంప్లెక్స్ లో ప్రెస్ క్లబ్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా చిక్కాల రామకృష్ణ, మారంపూడి ఏసుదాసు ఇతర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చిక్కాల రామకృష్ణ మాట్లాడుతూ సంఘసంస్కర్త, అభ్యుదయవాది, మహాకవి గురజాడ అప్పారావు జయంతి రోజున ప్రెస్ క్లబ్ ఆవిర్భావ సభ నిర్వహించామని అన్నారు. కుల, మత విద్వేషాలకు,మూఢాచారాలకు వ్యతిరేకంగా అభ్యుదయ భావాలను సమాజంలో పెంపొందించేందుకు తాము కృషి చేస్తామని అన్నారు. సమాజంలో పాత్రికేయుల గౌరవం పెరిగే విధంగా తాము కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. స్వర్గీయ వానపల్లి సుబ్బారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన పేరిట ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు ఇవ్వాలని తీర్మానించినట్లు తెలియజేశారు. ఉపాధ్యక్షునిగా ఎన్నికైన సీనియర్ జర్నలిస్టు అలమండ నరసింహారావు మాట్లాడుతూ వానపల్లి సుబ్బారావు తాడేపల్లిగూడెంలో నాలుగు దశాబ్దాల క్రితం ప్రెస్ క్లబ్ ను స్థాపించి తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన విగ్రహం ఏర్పాటు చేయడం మన బాధ్యత అని అన్నారు. ప్రధాన కార్యదర్శి మారంపూడి ఏసుదాసు మాట్లాడుతూ వానపల్లి సుబ్బారావు స్ఫూర్తితో ప్రెస్ క్లబ్ కు మెరుగైన సేవలు అందిస్తామని అన్నారు. రాజకీయ నాయకులు, ప్రభుత్వ అధికారులు, ప్రముఖులు ప్రెస్ క్లబ్ కు సహకరించాలని ఆయన కోరారు. నూతన ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా చిక్కాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా మారంపూడి ఏసుదాసు, ఉపాధ్యక్షులుగా అలమండ నరసింహారావు, వానపల్లి దేవేంద్ర,గారపాటి ప్రసాద్ , సంయుక్త కార్యదర్శి గా నీలం సురేష్ , సహాయ కార్యదర్శిగా ముప్పిడి సుశీల, కోశాధికారి గా మారంపూడి అవినాష్, కార్యవర్గ సభ్యులుగా పిళ్ళా రాంబాబు, మెరిపో అనిల్ కుమార్,ఎం. పెద్దిరాజు,బి. ఎన్. మూర్తి ఏకగ్రీవం గా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు.

## అంతా సుభిక్షంగా ఉండాలి

- శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి

నేడు మహా అన్నదాన కార్యక్రమం



ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: ప్రజలంతా ఆయురారోగ్యాలతో, ఆనందంగా సుభిక్షంగా ఉండాలని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి ఆకాంక్షించారు. నేడు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తునామన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నగరంలోని శ్రీ బాలాజీ ఎస్టేట్స్ ప్రధాన కార్యాలయంలో, శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ గణపతి స్వామి విగ్రహం వద్ద సోమవారం పూజలు, కోలాట బృందంచే కోలాట కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ తొలిసారి గణేష్ విగ్రహాన్ని తమ కార్యాలయంలో నెలకొల్పి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే కుంకుమార్చన, సరస్వతి పూజలు ఘనంగా నిర్వహించడం జరిగిందాన్నారు. ఎల్ ని నో ప్రభావంతో దేశం, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు పడక రైతులలో, ప్రజలలో తీవ్ర ఇబ్బంది నెలకొందని పేర్కొన్నారు. వ్యవసాయం గాడినపడి పాడిపంటలతో రైతుల కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. వ్యవసాయ రంగం మంచిగా ఉంటే అన్ని రంగాలు పరిడవిల్లుతాయని తద్వారా అందరూ ఆర్థికంగా పరిపుష్టి సాధిస్తారాన్నారు. అందరి జీవితాలలోని విఘ్నాలు తొలగిపోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజింగ్ పార్ట్నర్ రేణుక రవి, కార్యాలయపు ఇన్చార్జ్ పోగుల రవికుమార్, ఉత్సవ కమిటీ బాధ్యులు శ్రీనివాసరాజు,సాయికిరణ్, కృష్ణ చౌదరి, వి నరేష్, సీనియర్ మార్కెటింగ్ డైరెక్టర్లు షేక్ తాజుద్దీన్, కాసాని శ్రీశైలం, గాలి నారాయణ, తోట వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ డైరెక్టర్లు, మార్కెటింగ్ సిబ్బంది కార్యాలయపు సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

## విజయవాడలో వై. ఎస్. ఆర్ పార్టీ వర్సెస్ స్పోర్ట్స్ కోటా టీచర్లు

-శాప్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత




విజయవాడ, సెప్టెంబర్ 21 నేటి శుభోదయ: నగరంలో మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాల వ్యవహారం రాజకీయ నిరసనకు.. టీచర్ల ప్రతిస్పందనకు దారితీసింది. స్పోర్ట్స్ కోటా నియామకాల్లో అక్రమాలు, నకిలీ ధ్రువపత్రాల వినియోగం జరిగిందంటూ వైసీపీ ఆరోపిస్తూ శాప్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగింది.ఈ నేపథ్యంలో స్పోర్ట్స్ కోటా ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు కూడా అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య పోటాపోటీ నినాదాలు వినిపించాయి. తమ వద్ద నియామకాలకు సంబంధించిన అక్రమాలపై ఆధారాలు ఉన్నాయని వైసీపీ నేతలు చెబుతుండగా.. టీచర్లు మాత్రం తమ వద్ద ఉన్న ఒరిజినల్ సర్టిఫికెట్లు, మెడల్స్ నిజమైనవేనని స్పష్టం చేశారు.మరోవైపు పోలీసులు జోక్యం చేసుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నిరసనను అడ్డుకునే ప్రయత్నం చేసిన పోలీసులతో వైసీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. తమకు వచ్చిన ఉద్యోగాలు క్రీడా ప్రతిభ, అర్హతలు, ధ్రువపత్రాల ఆధారంగానే లభించాయని స్పోర్ట్స్ కోటా టీచర్లు చెబుతున్నారు. గతంలో తాము సాధించిన పతకాలు, పొందిన సర్టిఫికెట్లను కూడా ప్రదర్శిస్తూ తమ నియామకాలపై వస్తున్న ఆరోపణలను వారు ఖండించారు. ఇదిలా ఉండగా, స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన అభ్యర్థుల అర్హతలను నిబంధనల ప్రకారం పరిశీలిస్తున్నామని, ఏదైనా ధ్రువపత్రం నకిలీగా తేలినా లేదా అర్హత నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించినా తగిన చర్యలు తీసుకుంటామని ఏపీ అధికారులు గతంలో తెలిపారు.'మాకే సవాల్ చేస్తారా?' అంటూ వైసీపీ కార్యకర్తలు అభ్యర్థుల వైపు దూసుకెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో ఓ ఉపాధ్యాయుడి తలకు గాయం కావడంతో ఆస్పత్రికి తరలించారు. తమ ప్రతిభతోనే ఉద్యోగాలు సాధించామని, తమను అవమానించడం బాధ కలిగిస్తోందని స్పోర్ట్స్ కోటా అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరు వర్గాల మధ్య పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి, ఇరువర్గాలకు పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

## పి జి ఆర్ ఎస్ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు"




తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 19 (నేటి-శుభోదయ) తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ ఎం. ఏసుబాబు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిజిఆర్ఎస్లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, ఆస్తి పన్ను, పెన్షన్లు, పారిశుద్ధ్యం తదితర సమస్యలపై వచ్చిన దరఖాస్తులను శాసనసభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫిర్యాదులపై వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు.ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించి, ప్రజలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడాలని అని కమిషనర్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే పాలనా నినాదంతో ప్రభుత్వం..!

-ఎమ్మెల్యే జూలకంటి..!




మాచర్ల : ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 21; నేటి శుభోదయ : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న నందమూరి తారక రామారావు నినాదమైన ప్రజల వద్దకే పాలన కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తుందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. సోమవారం స్థానిక వివిఎన్ గార్డెన్ నందు పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రజల నుంచి సమస్యల అర్జీలను స్వీకరించి తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సుపరిపాలనే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అడుగులు వేస్తున్నారని తెలిపారు. నిత్యం ప్రజా సమస్యలపై అధికారులతో కూటమి పార్టీల నాయకులతో ప్రజా గ్రీవెన్స్ నిర్వహించి, తక్షణమే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని వివరించారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధి లక్ష్యంగా గడిచిన రెండేళ్ల పాలనలో వేల కోట్లతో జల్ జీవన్ మిషన్, అమృత్ స్కీం, వరికపూడిశెల ప్రాజెక్టులన్నీ పట్టాలెక్కయని ఆయన వెల్లడించారు. మండాది, పట్లవీడు గ్రామాల మధ్య 500 ఎకరాల్లో టెక్స్టైల్ పార్క్, 800 ఎకరాల్లో ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి త్వరలో శంకుస్థాపనలు జరుగుతాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ అధికారి కృష్ణప్రియ,డిఆర్ఓ అద్దెయ్య, ఆర్డీవో మురళీకృష్ణ, నియోజకవర్గ ప్రత్యేక అధికారి గబ్రూ నాయక్, జిల్లాస్థాయి అధికారులు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేదలకు సాగుభూమి కేటాయించాలి

దుర్గి మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులకు పంపిణీ చేయాలని ఎంసీపీఐ(యు) వినతి



మాచర్ల ఆర్సి ఇన్చార్జి సెప్టెంబర్ 21; నేటి శుభోదయ : దుర్గి మండలంలోని భూమిలేని నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలకు సాగుభూమి కేటాయించాలని ఎంసీపీఐ(యు) పల్నాడు జిల్లా నాయకులు కోరారు. సోమవారం మాచర్లలో జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు.మండలంలోని అనేక పేద కుటుంబాలకు సొంత భూమి లేకపోవడంతో రోజువారీ కూలి పనులపై ఆధారపడుతున్నారని నాయకులు తెలిపారు. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కోలగట్లలో సుమారు 250 ఎకరాలు, ముటుకూరులో సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ భూములను అధికారులు పరిశీలించి విస్తీర్ణం, వినియోగం, ఆక్రమణలపై సమగ్ర నివేదిక రూపొందించాలని కోరారు. ప్రభుత్వ భూములను గుర్తించిన అనంతరం అర్హులైన కుటుంబాలను పారదర్శకంగా ఎంపిక చేసి సాగు కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. భూమి లభిస్తే పేద కుటుంబాలు వ్యవసాయం ద్వారా స్వయం ఉపాధి పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. భూమిలేని కుటుంబాల పరిస్థితిని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని సమగ్ర సర్వే నిర్వహించాలని, అర్హులకు సాగుభూమి కేటాయించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ను కోరారు.

# ఖమ్మం వీధుల్లో కిసాన్ సభల కళా ప్రదర్శనలు

### ఆసక్తికరంగా అరుణోదయ ప్రచారం




ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: ఈనెల 28,29, 30తేదీల్లో జరగనున్న అఖిల భారత కిసాన్ సభల ప్రచారంలో భాగంగా అరుణోదయ కళాకారులు ఖమ్మం లోని వీది వీదినా వారంరోజులుగా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా ఈనెల 28న యస్ఆర్ అండ్ బిజీయన్ఆర్ కళాశాల గ్రౌండ్ లో జరిగే భారీ బహిరంగ సభ గురించి, తెలంగాణాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 60మంది కళాకారులు మూడు జట్లుగా ఏర్పడి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, రైతు-కూలీ మహాసభల ప్రాదాన్యత పైన విస్త్రుత ప్రచారం నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మూడు కళా బృందాల ప్రచారం పట్టణంలో హోరెత్తుతుంది. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కు చెందిన సూర్యాపేట ఉదయగిరి బృందం గొంగళ్ళు ధరించి రైతు-కూలీల సమస్యలను తెలంగాణా యాసలో మాట,పాటలుగా మలిచి,కూర్పుచేసుకొని ప్రదర్శనలిస్తున్నారు ."రండన్నా పోదాం మనం-రైతుకూలీ సభలకు"అంటూ పాట,అంటే,మాట ద్వారా ఆకట్టు కుంటున్నారు. నాటు వేసే దగ్గరనుండి మొక్కపెంచి ,పంట అమ్ముకునే వరకు ఎదురయ్యే సమస్యలు ఏకరువు పెట్టి ఆసక్తికరమైన ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇక మరో అరుణోదయ డప్పు కళాకారులు బృందం కొత్తగూడెం కు చెందిన చిరంజీవి నేతృత్వంలో సామూహిక డప్పు నృత్యాలు చేస్తూ పట్టణంలోని శ్రామిక వాడల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.లయబద్దంగా వేస్తున్న డప్పు బృందం అడుగుల ద్వారా ప్రజలను ఆకట్టుకొంటున్నారు. మంచిర్యాల జిల్లా కు చెందిన అరుణోదయ బృందం అందెమంగ నేత్రృత్వంలో రైతు-కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై వీది నాటికలు వీది వీదినా ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో పరిస్థితి, తద్వారా బోర్లు ఎండిపోవడం,పంటలు ఎండిపోవడం , వర్షాలు కురవక పోవడం,ధరలు పెరగడం,లాంటి కరువు పరిస్థితి కళ్ళకు కట్టేలా స్క్రిప్ట్ తయారు చేసుకొని వీధి వీధినా వీది నాటికలు అనబడే అదృశ్యరూపాలతో ఆకట్టు కుంటున్నారు. జాతీయ మహాసభలు ప్రాదాన్యత రిత్యా , సభల సమయం దగ్గర పడుతున్న కొద్ది అరుణోదయ సాంస్కృతిక సంస్థ తన ప్రచారం ముమ్మరం చేయడంతో పాటు,ఇతర రాష్ట్రాల కళా బృందాల ను సైతం ప్రచారం లో పాల్గొనేలా వ్యూహరచన చేస్తున్నారు.ముఖ్యంగా రైతులు పరిస్థితి "అమ్మబోతే అడవి- కొనబోతే కొరివి"లాగా ఉన్న స్థితి నుంచి,ఎరువుల కొరత, రైతాంగ దోపిడీకి గురయ్యే పద్దతులనుకళాకారులు విడమర్చి చెబుతున్నారు. అరుణోదయ కళాకారులు ఖమ్మం పట్టణంలో నే కాకుండా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో అరుణోదయ కళాకారులు ,రైతు-కూలీ సమస్యలపైన విస్తృత ప్రచారం చేస్తున్నారు. అఖిలబారత రైతు మహాసభలులు కనుక తెలంగాణా వ్యాప్తంగా విస్తృత ప్రచారం జరుగుతోందని అరుణోదయ సాంస్కృతిక సంస్థ తెలిపింది. ఈ కళా బృందాల వెంట ప్రచారంలో సిపిఐ యంయల్ న్యూడెమోక్రసీ నాయకులు, రైతుకూలీ సంఘం నాయకులు ,పిడియస్యు,పిఓడబ్లు మహిళా సంఘాలు పాల్గొని పసభలను జయప్రదం చేయవలసిందిగా కోరుతున్నారు. ఏఐకేయంయస్ సభల్లో వివిధ రాష్ట్రాల కు సంభందించిన కళాకారులు బృందాలు హిందీ, పంజాబీ, బెంగాలీ, తమిళం, కన్నడం, ఒరియా తదితర దేశీయ భాషల్లో కళారూపాలు ప్రదర్శనకు సన్నద్ధం అవుతున్నారు. ఖమ్మం పట్టణంలో కిసాన్ మహాసభలు ప్రచారం ఊపందుకుంది.దానిలో అరుణోదయ సాంస్కృతిక సంస్థ సోషల్ మీడియా లో రూపొందించిన లఘు చిత్రాలు,కళాకారులు కళా ప్రదర్శనలు ఆకట్టు కొంటున్నాయి.

# ఏబీపీపీ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా టి.వి. పుల్లంరాజు ఏకగ్రీవ ఎన్నిక

ఖమ్మం, శబరిమల, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: అఖిలభారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ (ఏబీపీపీ) ట్రస్ట్ నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం శబరిమల నారాయణతోడు లోని అఖిలభారతీయ అయ్యప్పధర్మ ప్రచారసభ అన్నదాన మందిరంలో నిర్వహించారు. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ట్రస్ట్ ద్వైవార్షిక ఎన్నికలను ఏబీపీపీ మేనేజింగ్ ట్రస్టీ పి.ఎన్.కె. మేనన్ ఎన్నికల అధికారిగా, ఏబీపీపీ ప్రధాన కార్యదర్శి బెల్లపు హరిప్రసాద్ పరిశీలకుల పర్యవేక్షణలో నిర్వహించారు.

### ఈ ఎన్నికల్లో తెలంగాణకు చెందిన

డాక్టర్ తోకచిచ్చు వెంకట పుల్లంరాజు (టి.వి. పుల్లంరాజు) ఏబీపీపీ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కేరళకు చెందిన కె. అయ్యప్పదాస్ అధ్యక్షులుగా, తెలంగాణకు చెందిన టి.వి. పుల్లంరాజు ప్రధాన కార్యదర్శిగా, తమిళనాడుకు చెందిన ఆర్. వెంకటేశన్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

### - ట్రస్ట్ సభ్యులుగా వివిధ రాష్ట్రాల ప్రతినిధులు

ట్రస్ట్ సభ్యులుగా తెలంగాణ నుంచి రాచర్ల రమేష్ (హైదరాబాద్), బయ్యాన సంతోష్ (హనుమకొండ), ఆంధ్రప్రదేశ్ నుంచి లంకబాబు (విజయవాడ), ప్రవీణ్ నంబూద్రి (విశాఖపట్నం), తమిళనాడు నుంచి ఎల్.ఆర్. రాజు (కరూర్), వినాయగం (రాణిపేట), టి. వెంకటేశన్ (తిరువణ్ణామలై), కర్ణాటక నుంచి వంశీకృష్ణ ఎన్నికయ్యారు.

### భక్తులకు మరింత మెరుగైన అన్నప్రసాద సేవలు

ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన టి.వి. పుల్లంరాజు మాట్లాడుతూ



దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఏబీపీపీ ట్రస్ట్ సేవలను మరింత విస్తరించేందుకు, ట్రస్ట్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా మండల-మకరవిళక్కు సీజన్లో శబరిమలకు వచ్చే అయ్యప్ప స్వామి భక్తులకు అన్నదాన మండపం ద్వారా నాణ్యమైన, రుచికరమైన అన్నప్రసాదాన్ని అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. మండల-మకరవిళక్కు సీజన్లో సుమారు ఎనిమిది లక్షల మంది భక్తులకు అన్నప్రసాదం అందించే విధంగా ప్రణాళికలు రూపొందించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని పుల్లంరాజు తెలిపారు.

### - తెలుగు రాష్ట్రాలకు గౌరవం

అయ్యప్ప స్వామి భక్తుల సేవా ట్రస్ట్లో తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తికి ప్రధాన కార్యదర్శి పదవి దక్కడం ఇదే ప్రథమమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పుల్లంరాజు ఏకగ్రీవ ఎన్నిక పట్ల తెలంగాణతో పాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన అయ్యప్ప స్వామి భక్తులు, ఏబీపీపీ ప్రతినిధులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ప్రధాన కార్యదర్శిగా పుల్లంరాజు ఎన్నిక కావడం ద్వారా శబరిమలలో అయ్యప్ప స్వామి భక్తులకు అందించే సేవల్లో తెలుగు రాష్ట్రాల భాగస్వామ్యం మరింత పెరగనుందని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా టి.వి. పుల్లంరాజును పలువురు అయ్యప్ప స్వామి భక్తులు, ఏబీపీపీ ప్రతినిధులు, ప్రముఖులు అభినందించారు.

## ఘనంగా గురజాడ అప్పారావు జయంతి వేడుకలు




కాకినాడ జిల్లా, జగ్గంపేట సెప్టెంబర్ 21 నేటి శుభోదయ : జగ్గంపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, కళాశాల ప్రిన్సిపాల్ డా.డి. చెన్నారావు ఆధ్వర్యంలో, తెలుగు శాఖాధిపతి డా.డి. సత్యలత ప్రముఖ తెలుగు కవి, రచయిత, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. డి. చెన్నారావు మాట్లాడుతూ, గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. "దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్" అనే సందేశం ద్వారా దేశభక్తి, మానవతా విలువలను ప్రజల్లో పెంపొందించారని తెలిపారు. సమాజంలోని మూఢనమ్మకాలు, అసమానతలు, బాల్యవివాహాలు వంటి సామాజిక సమస్యలను తన రచనల ద్వారా ప్రశ్నించి, సంస్కరణలకు మార్గం చూపారని అన్నారు.తెలుగు శాఖాధిపతి డా. డి. సత్యలత మేడమ్ మాట్లాడుతూ, గురజాడ అప్పారావు ఆధునిక తెలుగు సాహిత్యానికి మార్గదర్శకుడని, ఆయన రచనలు నేటి తరానికి కూడా ఎంతో స్ఫూర్తిదాయకమని వివరించారు. "కన్యాశుల్కం" వంటి నాటకం ద్వారా సమాజంలోని దురాచారాలను ఎత్తిచూపి, సామాజిక చైతన్యాన్ని తీసుకువచ్చారని పేర్కొన్నారు. విద్యార్థులు గురజాడ సాహిత్యాన్ని అధ్యయనం చేసి ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు.ఈ సందర్భంగా విద్యార్థులు గురజాడ అప్పారావు జీవిత విశేషాలు, సాహిత్య సేవలు, సామాజిక సంస్కరణలపై ప్రసంగాలు చేశారు. ఆయన రచనలు, తెలుగు భాషాభివృద్ధికి చేసిన కృషిని స్మరించుకున్నారు. గురజుడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ సిహెచ్ బాలరాజు , ఐ. క్యూ.ఏ. సి కో-ఆర్డినేటర్ డా.పి.వి.వి. సత్యా నారాయణ , కామర్స్ ఆధ్యాపకులు, పి.పద్మ శేఖర్ , ఆంగ్ల ఆధ్యాపకులు వై. ఏ.ఎస్. శ్రీనివాస్, జువాలజీ ఆధ్యాపకులు పి. శ్రీనివాస రావు , హిస్టరీ ఆధ్యాపకులు ఆర్. శ్రీనుగారు, బోటాని అధ్యాపకురాలు వై.నవీన , గణిత ఆధ్యాపకురాలు కె.టి. నాగ జ్యోతి , భౌతికశాస్త్ర ఆధ్యాపకులు పి.శేఖర్ ఇతర అధ్యపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## పండుగలు సామరస్యానికి ప్రతీకలు

ఐక్యతతోనే సమాజ పురోగతి సాధ్యం



ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: పండుగలు సమాజంలో సామరస్యానికి, సోదరభావానికి ప్రతీకలుగా నిలుస్తాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని రామవరం, రామాటాకీస్ ఏరియా, పాతకొత్తగూడెం, బూడిదగడ్డ తదితర ప్రాంతాలలో వివిధ ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ తో కలిసి ఆయన సందర్శించారు. వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కులమతాల అంతరాలు లేకుండా అందరూ కలిసి జరుపుకునే ఇలాంటి వేడుకలు సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయన్నారు. ఆధ్యాత్మిక చింతనతో పాటు పరోపకార గుణాన్ని, పేదలకు సాయపడే తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. సమాజ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ విద్యావంతులై సామాజిక చైతన్యానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నియోజకవర్గంలోని ప్రతీ సమస్య పరిష్కారానికి తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు మండపాల నిర్వాహకులు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, బాధ్యతాయుతంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమాల్లో నాయకులు కంచర్ల జమలయ్య, భూక్యా శ్రీనివాస్, మునిగడప పద్మ, మునిగడప వెంకటేశ్వర్లు, బండి నర్సింహా, విసంశెట్టి విశ్వేశ్వరరావు, సునీత, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, భవాని, సాంబిరెడ్డి, మల్లేష్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేట భాష్యం పాఠశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన మరియు మాక్ డ్రిల్



కాకినాడ జిల్లా, జగ్గంపేట సెప్టెంబర్ 21 నేటి శుభోదయ : జగ్గంపేటలోని భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో సోమవారం అగ్నిప్రమాదాల నివారణ, ప్రాణనష్టం జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు మరియు మాక్ డ్రిల్ (నమూనా ప్రదర్శన) నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఫైర్మెన్ కమ్ రైటర్ డి. నానాజీ, లీడింగ్ ఫైర్ ఫైటర్ ఆర్. చంద్రశేఖర్ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అగ్నిప్రమాదాలపై కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఫైర్మెన్ కమ్ రైటర్ డి. నానాజీ మాట్లాడుతూ, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు పడకుండా సంయమనంతో వ్యవహరించాలని కోరారు. ముఖ్యంగా పాఠశాలలు, నివాస గృహాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేదా గ్యాస్ లీకేజీల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, అటువంటి సమయంలో అనుసరించాల్సిన ప్రాథమిక రక్షణ పద్ధతులను ఆయన వివరించారు. నిరంతరం అప్రమత్తంగా ఉండడం ద్వారా పెద్ద ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.అనంతరం లీడింగ్ ఫైర్ ఫైటర్ ఆర్. చంద్రశేఖర్ మాట్లాడుతూ, అగ్నిప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ స్టేషన్కు సమాచారం అందించాలని కోరారు. ప్రమాద సమయంలో భవనాల నుంచి సురక్షితంగా బయటకు వచ్చే మార్గాలను (ఎగ్జిట్ రూట్స్) విద్యార్థులకు వివరించారు. అందుబాటులో ఉన్న అగ్నిమాపక పరికరాలను (ఫైర్ ఎక్స్టింగిషర్స్) ఎలా ఉపయోగించాలో ఆయన ప్రాక్టికల్గా చేసి చూపించారు.ఈ కార్యక్రమంలో భాగంగా అగ్నిమాపక సిబ్బంది విద్యార్థుల సమక్షంలో లైవ్ మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రమాదం జరిగినప్పుడు మంటలను ఎలా అదుపు చేయాలో ప్రత్యక్షంగా ప్రదర్శించి చూపించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. అగ్నిమాపక శాఖ వారు అందించిన ఈ అవగాహన తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.



# అక్టోబర్‌లోగా యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేలా చర్యలు

: మంత్రి తుమ్మల

- సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలు అందించడమే లక్ష్యం
- 25 రోజుల్లో టన్నెల్ పనులు పూర్తి చేయాలి : అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు, పంటలను కాపాడేందుకు గోదావరి జలాల వినియోగం
- కమలాపురం పంప్‌హౌస్ నుంచి అన్నదైవం ప్రాజెక్టుకు నీటి విడుదల
- కుమ్మరిపాడులో హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డు ప్రారంభం



ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించి రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు పనులను వేగవంతం చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట వద్ద సీతారామ ప్రాజెక్టు టన్నెల్ పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు.యాతాలకుంట టన్నెల్‌లో జరుగుతున్న పనులను పరిశీలించిన మంత్రి, టన్నెల్ నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. టన్నెల్ కింది భాగంలో ఉన్న ఖాళీలను కాంక్రీట్‌తో పటిష్టంగా నింపాలని, గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. టన్నెల్ పనుల్లో నాణ్యత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి జాప్యానికి తావులేకుండా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.టన్నెల్‌కు సంబంధించిన మిగిలిన పనులను 25 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని అధికారులు మంత్రికి వివరించారు. అక్టోబర్ నెలలో టర్నల్ పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర మిగిలిన పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.అనంతరం ములకలపల్లి మండలం కుమ్మరిపాడు గ్రామంలో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులతో 4 కోట్ల 63 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన హై లెవల్ బ్రిడ్జి, బీటీ రోడ్డును మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు రాకపోకలు సులభతరం చేయడంతో పాటు అన్ని కాలాల్లో రవాణా సౌకర్యం అందుబాటులో ఉండేలా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు.తదుపరి ములకలపల్లి మండలం కమలాపురం గ్రామంలో సీతారామ ఎత్తిపోతల పథకంలోని మూడో పంప్‌హౌస్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తో కలిసి పరిశీలించి,మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. పంప్‌హౌస్ నుంచి విడుదలైన నీటి ప్రవాహాన్ని పరిశీలించి, నీటి విడుదలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాగు అవసరాలకు అనుగుణంగా నీటిని సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు ద్వారా సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి జలాలను అందించాలన్నది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. సత్తుపల్లి ట్రంక్‌కు గోదావరి నీటిని అందించే దిశగా ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నామని చెప్పారు. యాతాలకుంట వద్ద టన్నెల్ పనులను పరిశీలించి, మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. టన్నెల్‌లో కొన్ని ప్రాంతాల్లో కింది భాగంలో ఖాళీలు ఉండటంతో వాటిని కాంక్రీట్‌తో పూర్తిస్థాయిలో ప్యాకింగ్ చేసి పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రౌటింగ్, ప్యాకింగ్, కాంక్రీట్ పనులను సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని సూచించామని చెప్పారు. టన్నెల్ పనుల్లో తొందరపాటు కంటే నాణ్యత, భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పటిష్టంగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.అక్టోబర్‌లో సీతారామ ప్రాజెక్టు పనులను పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. టన్నెల్ లైనింగ్, కెనాల్ లైనింగ్, రోడ్ క్రాసింగ్స్ తదితర పనులను వేగవంతం చేసి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించామని తెలిపారు.సత్తుపల్లి ట్రంక్‌కు నీటిని తీసుకెళ్లే క్రమంలో భూసేకరణకు సంబంధించిన సమస్యలను దాదాపుగా పరిష్కరించామని మంత్రి తెలిపారు. భూసేకరణ కోసం ఇటీవల రూ.48 కోట్లు విడుదల చేశామని, ఇంకా అవసరమైన భూముల కోసం జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపితే అవసరమైన నిధులను కూడా సమకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూసేకరణ, నిర్మాణ పనులు, సాంకేతిక సమస్యలు ఏవైనా ఉంటే వాటిని వేగంగా పరిష్కరించి ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో వర్షపాతం తక్కువగా ఉండటం, ఎల్‌నినో ప్రభావం వంటి



కారణాలతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని మంత్రి అన్నారు. వర్షాలు సకాలంలో లేకపోవడం వల్ల భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయని, ఈ పరిస్థితుల్లో ఖరీఫ్ పంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు సాగు చేసిన పంటలకు అవసరమైన సమయంలో నీటిని అందించేందుకు గోదావరి జలాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకుని, ఏ ప్రాంతానికి ఎంత నీరు అవసరమో ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.వర్షాభావ పరిస్థితులు వ్యవసాయంతో పాటు విద్యుత్ రంగంపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. నీటి నిల్వలు తగ్గితే జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గే అవకాశం ఉంటుందని, అదే సమయంలో వ్యవసాయం, పరిశ్రమలు, గృహ అవసరాల కోసం విద్యుత్ డిమాండ్ పెరుగుతుందని చెప్పారు. జలవిద్యుత్ ఉత్పత్తి తగ్గినప్పుడు థర్మల్ విద్యుత్‌పై ఎక్కువగా ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. అందువల్ల నీటి లభ్యత, విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.సీతారామ ప్రాజెక్టు ద్వారా ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో కూడా సాగునీటి అవసరాలను తీర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దమ్మపేట, అశ్వారావుపేట ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆయిల్‌పామ్ సాగు జరుగుతున్నందున సాగునీటి సౌకర్యం మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సుమారు 80 వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ఉన్న ప్రాంతాలకు నీటి లభ్యతను పెంచే విధంగా సీతారామ జలాలను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.నాలుగో పంప్‌హౌస్ ద్వారా అవసరమైన ప్రాంతాలకు నీటిని తీసుకెళ్లేలా పనులను వేగవంతం చేయాలని మంత్రి తెలిపారు. ప్రధాన కాలువలతో పాటు అవసరమైన చోట్ల పైప్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే భూసేకరణ సమస్యలు తగ్గుతాయని, నీటిని నేరుగా రైతుల పొలాలకు తీసుకెళ్లే అవకాశం ఉంటుందని చెప్పారు. పైప్‌లైన్‌తో పాటు డ్రిప్, స్ప్రింక్లర్ విధానాలను ప్రోత్సహించడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చని, తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పనులపై జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు వారానికోసారి సమీక్ష నిర్వహించాలని మంత్రి సూచించారు. అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల ఎక్కడా పనులు నిలిచిపోకూడదని, ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే జిల్లా స్థాయిలో పరిష్కరించాలని అన్నారు. అవసరమైన అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ములకలపల్లి ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రహదారులు, మండల కార్యాలయాలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఎంపీడీవో కార్యాలయం, పోలీస్ స్టేషన్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. కమలాపురం వద్ద పంప్ మోటార్‌ను ఆన్ చేసి అన్నదైవం ప్రాజెక్టుకు నీటిని విడుదల చేయడం ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీటి ప్రయోజనం కల్పించే దిశగా మరో అడుగు ముందుకు వేసినట్లు మంత్రి తెలిపారు. విడుదలైన నీరు ఆయకట్టులోని రైతులకు సక్రమంగా అందేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మెరుగైన రవాణా సౌకర్యాలు, పారిశ్రామిక, వ్యవసాయ అభివృద్ధికి విమానాశ్రయం, రైల్వే అనుసంధానం వంటి మౌలిక వసతులు అవసరమని మంత్రి తెలిపారు. విమానాశ్రయానికి సంబంధించి సాధ్యాసాధ్యాల నివేదిక సిద్ధమైన అనంతరం తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. రైల్వే అనుసంధానానికి సంబంధించి పాండురంగాపురం--మణుగూరు మార్గం, భద్రాచలం వైపు రైల్వే విస్తరణ అంశాలపై కూడా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలోని వ్యవసాయ రంగానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని, వర్షాలపై మాత్రమే ఆధారపడే పరిస్థితి తగ్గి సాగుకు నీటి భరోసా పెరుగుతుందని మంత్రి అన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## పెన్నా కళాశాలలో నూతన విద్యార్థులకు ఘనంగా ఓరియంటేషన్ కార్యక్రమం




యాడికి సెప్టెంబర్ 21 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండలంలోని బోయరెడ్డి పల్లె వద్ద ఉన్న పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్ సైన్సెస్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి గాను నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోసం ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యా విధానం, బి.ఎస్సీ. సిమెంట్ సైన్సెస్, కోర్సు ప్రత్యేకతలు, ఇండస్ట్రీ ట్రైనింగ్, క్యాంపస్ సదుపాయాలు, అకాడమిక్ నియమ నిబంధనలతో పాటు భవిష్యత్ విద్యా, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుమతి మాట్లాడుతూ, సిమెంట్ పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించేలా అకాడమిక్ విద్యతో పాటు పరిశ్రమలో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. దేశ మౌలిక వసతుల అభివృద్ధిలో సిమెంట్ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తున్నందున, ఈ రంగంలో ప్రత్యేక పరిజ్ఞానం, అనుభవం కలిగిన విద్యార్థులకు మంచి అవకాశాలు ఉంటాయని వివరించారు. ఈ సందేశం నూతన విద్యార్థుల్లో ఉన్న సందిగ్ధతను తొలగించి, వారి భవిష్యత్తుపై ఆత్మవిశ్వాసాన్ని నింపిందన్నారు. అలాగే కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్న అన్ని సీట్లు 100% భర్తీ అయిన ఏకైక కళాశాలగా పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్ సైన్సెస్ నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, సీనియర్ విద్యార్థులు, నూతన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు విశేషంగా పాల్గొన్నారు.



## మట్టి మిద్దె కూలి వృద్ధురాలు మృతి

**అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్న 'మే ఐ హెల్ప్ యు' ఫౌండేషన్**



యాడికి సెప్టెంబర్ 21 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : మండలంలోని బోగాలకట్ట గ్రామంలో మట్టిమిద్దె కూలిన ఘటనలో మృతిచెందిన వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహించి యాడికి 'మే ఐ హెల్ప్ యు' ఫౌండేషన్ సభ్యులు తమ ఉదారతను, మానవత్వాన్ని చాటుకున్నారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు బోగాలకట్ట గ్రామానికి చెందిన దిద్దేకుంట అశ్వత్థమ్మ (80) నివసిస్తున్న మట్టిమిద్దె ఆదివారం ఉదయం కూలిపోవడంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. మృతురాలికి అంతిమ సంస్కారాలు చేయడానికి కుటుంబ పరిస్థితుల రీత్యా ఎవరూ ముందుకు రాకపోవడంతో తీవ్ర విషాదం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న యాడికి 'మే ఐ హెల్ప్ యు' ఫౌండేషన్ సభ్యులు తక్షణమే స్పందించారు. సభ్యులు యాడికి నుంచి బోగాలకట్ట గ్రామానికి చేరుకుని, మృతురాలి అంత్యక్రియల బాధ్యతను పూర్తిగా తమపై వేసుకుని శాస్త్రోక్తంగా పూర్తి చేశారు. కష్టకాలంలో ముందుకు వచ్చి అంత్యక్రియలు జరిపించినందుకు ఫౌండేషన్ ప్రతినిధులకు మృతురాలి కుమార్తెలు, మనవళ్లు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.సమాజ సేవయే ధ్యేయంగా ముందుకు సాగుతున్న 'మే ఐ హెల్ప్ యు' ఫౌండేషన్ నిరంతరం అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అత్యవసర సమయంలో ప్రాణదానం చేసేందుకు తరచూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు, తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న బాధితులకు ఆర్థిక సాయం అందిస్తూ ఆసరాగా నిలుస్తోంది. అలాగే పేద కుటుంబాలకు ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం, గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం ద్వారా ఈ సంస్థ ప్రజాదరణ పొందుతోంది.ఈ అంత్యక్రియల కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ, చందగాని ధ్రువ నారాయణ, చింతా నరసింహ, అడవాల యుగంధర్, టి. లక్ష్మీకాంతమ్మ తదితరులు పాల్గొని సేవలందించారు.



## ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలి వియంసి కమిషనర్ ధ్యానచంద్ర




విజయవాడ, సెప్టెంబర్ 21(నేటి శుభోదయ):-ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికనుప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో శాఖాధిపతుల సమక్షంలో నిర్వహించారు. జోనల్ కమిషనర్లతో పాటు సర్కిల్ స్థాయిలోని అధికారులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అనుసంధానం చేసి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై సమీక్షించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, సమస్యకు తగిన పరిష్కారం అందించాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కేవలం కార్యాలయ స్థాయిలో పరిశీలించకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలకు సంబంధించి పలు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో, అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థలో సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కమిషనర్ సూచించారు. నగరంలో ప్రతిరోజూ ఎక్కడెక్కడ డీసిల్టింగ్ ప్రక్రియ జరుగుతుందో వివరాలతో కూడిన నివేదికను సిద్ధం చేసి, ఎప్పటికప్పుడు తనకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో చెత్త కుప్పలకు సంబంధించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించి, పారిశుద్ధ్య కార్మికుల ద్వారా చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి జాప్యం లేకుండా, సమస్య స్వభావాన్ని బట్టి అత్యంత త్వరగా పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిగణించి, సకాలంలో పరిష్కరించడం ద్వారా ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలని కమిషనర్ ధ్యానచంద్ర అధికారులకు స్పష్టం చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 26 ఫిర్యాదులు స్వీకరించగా, వాటిపై సంబంధిత అధికారులకు తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. వీటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించి అక్రమ నిర్మాణాలు, రోడ్ల ఆక్రమణలకు సంబంధించిన 10 ఫిర్యాదులు, ఇంజనీరింగ్ శాఖకు 8, ఎస్టేట్ 1, రెవెన్యూ శాఖకు 3, యూసిడి విభాగానికి 3, ఉద్యానవనం శాఖకు సంబంధించి 1 అందినట్లు కమిషనర్‌కు వివరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, చీఫ్ ఇంజనీర్ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, పర్యవేక్షణ ఇంజనీర్లు చంద్రశేఖర్, కె. దుష్యంత్, ఎక్సమినేర్ ఈఫ్ అకౌంట్స్ ఎస్. ఎన్. చక్రవర్తి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్. రత్నబాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గురజాడ అప్పారావు సాహిత్యం సమాజానికి స్ఫూర్తిదాయకం వియంసి కమిషనర్ ధ్యానచంద్ర



విజయవాడ, సెప్టెంబర్ 21(నేటి శుభోదయ):-గురజాడ అప్పారావు సాహిత్యం సమాజానికి స్ఫూర్తిదాయకం అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ప్రముఖ కవి, రచయిత గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సిబ్బందితో కలిసి గురజాడ అప్పారావు సాహిత్య సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యంలో చెరగని ముద్ర వేసిన మహనీయుడని అన్నారు. తన రచనల ద్వారా సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతలు, అన్యాయాలను ప్రశ్నిస్తూ ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని తీసుకువచ్చారని పేర్కొన్నారు. ముఖ్యంగా "కన్యాశుల్కం" నాటకం ద్వారా అప్పటి సమాజంలో ఉన్న బాల్యవివాహాలు, కన్యాశుల్కం వంటి దురాచారాలను ఎత్తిచూపి, సంస్కరణల ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారని అన్నారు. "దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్" అనే గురజాడ సందేశం సమాజం పట్ల ప్రతి ఒక్కరికీ ఉన్న బాధ్యతను గుర్తుచేస్తుందని కమిషనర్ తెలిపారు. గురజాడ అప్పారావు ఆశయాలు, సామాజిక చైతన్య సందేశం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నిర్మల గ్లోరీ, చీఫ్ ఇంజనీర్ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, పర్యవేక్షణ ఇంజనీర్లు చంద్రశేఖర్, కె. దుష్యంత్, ఎక్సమినేర్ ఈఫ్ అకౌంట్స్ ఎస్. ఎన్. చక్రవర్తి, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సిహెచ్. రత్నబాబు, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన ఏర్పాట్లను మరింత పెంచండి మరింత పెంచండి



విజయవాడ, సెప్టెంబర్ 21 (నేటి శుభోదయ):-వినాయక నిమజ్జన ఏర్పాట్లను మరింత పెంచండి మరింత పెంచాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం తన పర్యటనలో భాగంగా వన్ టౌన్, సీతమ్మ వారి పాదాల వద్ద జరుగుతున్న వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనానికి చివరి రోజులు కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున, అందుకు అనుగుణంగా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పూజా వ్యర్థాలను విగ్రహాల నుంచి వేరు చేసి సేకరించే పారిశుద్ధ్య సిబ్బంది సంఖ్యను మరింత పెంచి, ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. నిమజ్జన ప్రక్రియ ఎటువంటి ఇబ్బందులు లేకుండా వేగంగా పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు, వియంసి వారు ఏర్పాటుచేసిన తాగునీరు, వైద్య శిబిరాల లో లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ పి. సత్యకుమారి, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. నిర్మల గ్లోరీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన వాట్ వెల్ఫేర్ సెక్రెటరీకి, తనయుడికి కి గోల్డ్ మెడల్స్ అభినందించిన వియంసి కమిషనర్ ధ్యానచంద్ర




విజయవాడ, సెప్టెంబర్ 21 (నేటి శుభోదయ):-హైదరాబాద్‌లోని కాటేదాన్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆదివారం నిర్వహించిన ఓపెన్ నేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో విజయవాడకు చెందిన తండ్రీకొడుకులు విశేష ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్స్ సాధించడం అభినందనీయమని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో గోల్డ్ మెడల్స్ సాధించిన ఉప్పాల మురళీ మోహిత్, ఉప్పాల కోటేశ్వరరావులను కమిషనర్ అభినందించారు.యనమలకుదురుకు చెందిన 10 ఏళ్ల ఉప్పాల మురళీ మోహిత్ ఎల్లో బెల్ట్ కట విభాగంలో గోల్డ్ మెడల్ సాధించాడు. మురళీ మోహిత్ విజయ పబ్లిక్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. అదేవిధంగా యనమలకుదురుకు చెందిన ఉప్పాల కోటేశ్వరరావు 40 ఏళ్ల వయస్సులో ఎల్లో బెల్ట్ కట విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ విధి నిర్వహణతో పాటు క్రీడలపై ఆసక్తిని కొనసాగిస్తూ జాతీయ స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన కోటేశ్వరరావును, చిన్న వయస్సులోనే కరాటేలో ప్రతిభ కనబరుస్తున్న మురళీ మోహిత్‌ను అభినందించారు. తండ్రీకొడుకులు క్రీడా రంగంలో సాధిస్తున్న విజయాలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. క్రీడలతో పాటు విధి నిర్వహణలోనూ అంకితభావంతో ముందుకు సాగుతూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## బిల్డింగ్ ప్లాన్ సమస్యల పరిష్కారానికి ప్రధాన కార్యాలయంలో హెల్ప్ డెస్క్ వియంసి కమిషనర్ ధ్యానచంద్ర




విజయవాడ, సెప్టెంబర్ 21 (నేటి శుభోదయ):-విజయవాడ నగరంలో బిల్డింగ్ ప్లాన్లకు సంబంధించి ప్రజలు ఆన్లైన్ లో ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను కమిషనర్ స్వయంగా పరిశీలించి, అక్కడ అందుబాటులో ఉన్న ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ నగర ప్రజలు తమ భవన నిర్మాణాలకు సంబంధించి బిల్డింగ్ ప్లాన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సమయంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్లికేషన్ ప్రాసెస్, ప్లాన్ డ్రాయింగ్, పేమెంట్స్ తదితర అంశాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే ప్రజలు హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి అవసరమైన సహాయం పొందవచ్చని అన్నారు. బిల్డింగ్ ప్లాన్‌లకు సంబంధించిన ప్రక్రియలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మార్గదర్శకత్వం, సాంకేతిక సహకారం అందించాలని సంబంధిత సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకుని ప్రజలు తమ సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, ప్లానింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఘనంగా పరమ శివునికి అన్నాభిషేకం, దీపారాధనోత్సవ కార్యక్రమాలు



విజయవాడ, సెప్టెంబర్ 21 (నేటి శుభోదయ):-64వ డివిజన్ లోని కండ్రికలో శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ నిర్వాహకులు కాకొల్లు రవి కుమార్ ఆధ్వర్యంలో 8వ గణపతి మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 8వ రోజు సోమవారం ఉదయం కాకొల్లు రవి కుమార్, సతీమణి వరలక్ష్మీతో కలిసి తెల్లవారుజామున వినాయకునికి ప్రత్యేక పూజలు, పరమ శివునికి వివిధ రకాల అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రవి కుమార్ మాట్లాడుతూ శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి చవితి నవరాత్రి ఉత్సవాలను ఈ నెల 14వ తేదీ నుండి 23వ తేదీ వరకు ప్రతిరోజు తెల్లవారుజాము నుంచి వినాయకుని కి ప్రధాన అర్చకులు విశేష పూజలు నిర్వహిస్తారని తెలిపారు. వినాయకుడు విఘ్నాలను తొలగించి, విజయాలను ప్రసాదించే దేవుడని, ప్రతి శుభకార్యానికి గణనాథుడి పూజతో శ్రీకారం చుట్టడం మన సంస్కృతిలో ప్రత్యేకమైన సంప్రదాయమని అన్నారు. వినాయక చవితి పర్వదినం భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజలందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చే ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. గణనాథుని, పరమ శివుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని, ప్రజల జీవితాల్లో ఉన్న అన్ని విఘ్నాలు తొలగి అభివృద్ధి, విజయాలు చేకూరాలని శ్రీ వినాయకుడిని, పరమేశ్వరుని వేడుకున్నానని రవికుమార్ అన్నారు. శ్రీ లక్ష్మీగణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ అధ్వర్యంలో 8సంవత్సరాల నుండి చవితి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామి వారి సేవకు శ్రీ లక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ కమిటీ సభ్యులు, సహాయ సహకారాలు అందిస్తున్న దాతలకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. మధ్యాహ్నం నిర్వహించిన నిత్యాన్నదాన కార్యక్రమాన్ని కె.రవికుమార్ ప్రారంభించి భక్తులకు వడ్డించారు. అన్నవితరణ కార్యక్రమంలో సుమారు 5వేల మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం 6:30 గంటలకు పరమ శివునికి అన్నాభిషేకంతో పాటు, మహిళా భక్తులతో దీపారాధనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మహిళా భక్తులు, స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు మహేష్, పొలిశెట్టి చంద్ర శేఖర్, పల్లెల రవి, అల్లు నరేంద్ర, తోట సత్యనారాయణ,తోట వెంకట ప్రసాద్,పట్టేం శెట్టి నాగమణి,ఇ. హరికృష్ణ రెడ్డి, చిన్నారులు, స్థానిక భక్తులు, తదితరులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్లు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి

**కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన దళిత బహుజన భీమ్ సేన నాయకులు**



మాచర్ల, సెప్టెంబరు 21: ఆర్ సి ఇన్చార్జ్ సెప్టెంబర్ 21 ;నేటి శుభోదయ : మాచర్ల పట్టణంలోని వీవీఎన్ గార్డెన్స్‌లోని బోటు మీద కళ్యాణ మండపంలో సోమవారం మాచర్ల నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డాక్టర్ కృతికా శుక్లాకు దళిత బహుజన భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు జార్జి వినతిపత్రం అందజేశారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరినట్లు జార్జి తెలిపారు. ఆయా సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా సంఘాల నాయకులు తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రాలు అందజేశారు.

## గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా సంయుక్త కలెక్టర్ సి.విష్ణు చరణ్



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 21 నేటి శుభోదయ : అనంతపురము జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, రచయిత, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ. మలోల తదితర అధికారులతో కలిసి పాల్గొని గురజాడ అప్పారావు గారి చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురజాడ అప్పారావు గారు తెలుగు సాహిత్యానికి, సమాజ సంస్కరణకు అందించిన విశిష్ట సేవలను వారు స్మరించుకున్నారు. జేసి మాట్లాడుతూ సమాజంలోని మూఢనమ్మకాలు, సామాజిక దురాచారాలను తన రచనల ద్వారా ఎత్తిచూపి ప్రజల్లో చైతన్యం కల్పించిన గురజాడ అప్పారావు సాహితీ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలుగు భాషను ప్రజలకు మరింత చేరువ చేస్తూ వ్యవహారిక భాషకు ప్రాధాన్యత కల్పించడంలో గురజాడ అప్పారావు గారి కృషి విశేషమైనదని తెలిపారు. ఆయన రచనలు నేటికీ సమాజానికి స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి రమణ రెడ్డి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ అలెగ్జాండర్, కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, రియాజ్, తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు అందిస్తాం

**కొత్త చెరువులో రూ.65 లక్షలతో విద్యుత్ లైన్ల మార్పిడి**

**విద్యుత్ లైన్ల మార్పిడి పనులను**

**ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె**




అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 21 నేటి శుభోదయ : ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. కొత్త చెరువు మండలంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరిచేందుకు రూ.65 లక్షల వ్యయంతో చేపట్టనున్న విద్యుత్ లైన్ల మార్పిడి పనులను శనివారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత విద్యుత్ లైన్ల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని లైన్ల మార్పిడి పనులు చేపట్టినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. నియోజకవర్గంలో విద్యుత్‌కు సంబంధించిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని, ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మార్పిడి పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ ఈ మోసెస్, ఈఈ శివరాముడు, డీ ఈ, ఏఈఈ వెంకటేష్ అధికారులు, టీడీపీ నాయకులు వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు,రామకృష్ణ , టిడిపి సీనియర్ నాయకులు సాలక్క గారి శ్రీనివాసులు కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గండేపల్లి మండలం ఎంపీపీ, ఎంపీటీసీలకు ఘన సన్మానం

**తోట నరసింహ, జమీల్ ముఖ్య అతిథులుగా హాజరు**



కాకినాడ జిల్లా,గండేపల్లి సెప్టెంబర్ 21 నేటి శుభోదయ: గండేపల్లి మండల అభివృద్ధి, పరిపాలనలో తమవంతు పాత్ర పోషించిన మండల ఎంపీపీ, ఎంపీటీసీలను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. రామకుర్తి మూర్తి ఆధ్వర్యంలో మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించిన ఈ కార్యక్రమానికి జగ్గంపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోట నరసింహ, నియోజకవర్గ పరిశీలకులు జమీల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండల ఎంపీపీ చల్లగళ్ల పద్మనాభుడు (దొరబాబు)తో పాటు ఎంపీటీసీలను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. ముఖ్యంగా ఎంపీపీ చల్లగళ్ల పద్మనాభుడు (దొరబాబు) మండల అభివృద్ధి, పరిపాలనలో కీలకంగా వ్యవహరించారని పేర్కొంటూ ఆయన సేవలను అభినందించారు. ఈ కార్యక్రమానికి గండేపల్లి మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రామకుర్తి మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఘనంగా జరిగింది.

## కార్యకర్తల కుటుంబాలకు అండగా టీడీపీ.. 9 కుటుంబాలకు రూ.9 లక్షల ఆర్థిక సహాయం అందజేసిన ఎమ్మెల్యే బొండా ఉమా, బొండా సిద్ధార్థ



అజిత్ సింగ్ నగర్ లోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయం లో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు బొండా సిద్దార్థ కార్యకర్తల సహాయ నిధి ద్వారా 9 మంది తెలుగుదేశం పార్టీ క్రియాశీలకంగా ఉంటు మరణించిన కుటుంబాలకు ఒక్కొక్క రికి 1 లక్ష రూపాయలు 9 మందికి ? 9 లక్షల రూపాయల చెక్కులను అందజేసారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్న సందర్భాల్లో, పార్టీలో పనిచేసిన వారు మన మధ్య లేకపోయినా వారి కుటుంబ సభ్యులను గుర్తించి, వారసులు, భార్య లేదా తల్లికి ముఖ్యమంత్రి సహాయ నిధి మరియు కార్యకర్తల సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నాం, దీనివల్ల అనేక పేద కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతోంది. 26 నెలల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సుమారు రూ.9 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు ఈ నియోజకవర్గ ప్రజలకు సహాయం అందించడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ప్రజలకు సేవ చేయడం ఒక బాధ్యతగా భావిస్తున్నాను. ఎమ్మెల్యే పదవి అనేది అలంకారం కాదు. ప్రజలకు సేవ చేసే బాధ్యత అని, ప్రజలు నాపై నమ్మకంతో ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించారు. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు సేవ చేయడం ద్వారా వారి రుణం తీర్చుకోవడమే నా లక్ష్యం అని, డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల సమస్యలను నిరంతరం మా ఎమ్మెల్యే కార్యాలయానికి తీసుకువస్తున్నారు, ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైతే ముఖ్యమంత్రి కార్యాలయం వరకు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. ముఖ్యమంత్రి సహాయంతో మంజూరైన ఆర్థిక సహాయాన్ని చెక్కుల రూపంలో లబ్ధిదారులకు అందజేస్తూ, వారికి గౌరవంగా సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నాం, ఈ విధంగా ప్రజలకు అండగా నిలవడం నాకు ఎంతో సంతృప్తినిస్తోంది అని ఉమా అన్నారు. భవిష్యత్తులో కూడా ఆ దేవుడు ఇచ్చిన శక్తి ఉన్నంత వరకు సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు నిరంతరం సేవ చేస్తూ, వారి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తాను. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు కష్టసమయంలో అండగా ఉండాలన్నదే సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ లక్ష్యమన్నారు. కార్యకర్తల సంక్షేమానికి పార్టీ అధిష్ఠానం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. పార్టీ సభ్యత్వం తీసుకున్న ప్రతి కార్యకర్తకు, వారి కుటుంబాలకు కష్టకాలంలో అండగా ఉంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సమయంలో పార్టీ, ప్రభుత్వ పరంగా తనవంతు సహకారం అందిస్తానని ఉమా హామీ ఇచ్చారు. తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన సమయంలో సభ్యత్వ బీమా ద్వారా ఆర్థికంగా అండగా నిలిచిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు,మంత్రి నారా లోకేష్ కు, ఎమ్మెల్యే ఉమా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ఘంటా కృష్ణమోహన్, పార్టీ కార్యనిర్వాహన కార్యదర్శి దాసరి ఉదయశ్రీ, ఆకుల సూర్యప్రకాష్, కొమ్మినేని సురేష్, బొలిశెట్టి శేషుబాబు, కంచి ధనశేఖర్,నాని గౌస్ బాషా,దాసరి కనకరావు, వెలగ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## గురజాడ అప్పారావు సేవలు తెలుగు జాతికి చిరస్మరణీయం, తెలుగు భాషా వికాసానికి గురజాడ అప్పారావు కృషి - ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, సెప్టెంబర్ 20 (నేటి శుభోదయ):-33వ డివిజన్ సత్యన్నారాయణ పురం శివాజీ కేఫ్ సెంటర్ లో ప్రముఖ సాహితీ వేత్త, మహాకవి శ్రీ గురజాడ అప్పారావు 164వ జయంతి కార్యక్రమం లో ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని నివాళు అర్పించి, పేదలకు దుప్పట్లు, ఫ్రూట్స్, బిస్కెట్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ తెలుగు భాష, సాహిత్యం, సమాజ సంస్కరణ కోసం గురజాడ అప్పారావు చేసిన సేవలు తెలుగు జాతికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. తరాలు మారినా ఆయన రచనలు, ఆలోచనలు, సామాజిక చైతన్యం ప్రజలకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని పేద వర్గాలకు పుస్తకాలు, పండ్లు పంపిణీ చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు భాషను, సంస్కృతిని కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నాయకులు తెలిపారు. గురజాడ అప్పారావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవతో పాటు తెలుగు భాషాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గార్లపాటి విజయ కుమార్,నాళం కోటేశ్వర రావు, పొట్లూరి కృష్ణ ప్రసాద్, తమ్మ విజయలక్ష్మి, జీడిగుంట్ల రామలక్ష్మి, నాగయ్య, జొన్నలగడ్డ సాయి, వేమూరి భాను ప్రకాష్ కుందా వెంకటేశ్వర రావు, మోచేర్ల రమణ మూర్తి, దిట్టకవి మాధవ రావు, శోభనచలం తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం

**రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి చోటివ్వొద్దు**

**సమష్టి కృషితో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి**

**నారా లోకేష్‌ను లక్ష్యంగా చేసుకుని వైసీపీ చేస్తున్న డీఎస్సీ ప్రచారాలను తిప్పికొట్టాలి**

**ఎమ్మెల్యే పల్లె సింధూర ప్రత్యేక కృషితో పుట్టపర్తి రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుంది**

**టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో టీడీపీ జోనల్ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి,ఎంఎల్ఏ పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె వెల్లడి**




అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 21 నేటి శుభోదయ : స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమష్టిగా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీడీపీ జోనల్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. పుట్టపర్తి మామిళ్లకుంట క్రాస్‌లోని ఎస్.జి. ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన పుట్టపర్తి నియోజకవర్గ టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల కార్యాచరణ, అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీల సమన్వయం తదితర అంశాలపై నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయమే ప్రతి ఒక్కరి లక్ష్యం కావాలని నాయకులు అన్నారు. కూటమి పార్టీల మధ్య పూర్తి సమన్వయంతో, సమష్టి కృషితో ఎన్నికలను ఎదుర్కొని అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో వ్యక్తిగత అభిప్రాయాల కంటే పార్టీ అధిష్ఠానం నిర్ణయానికే ప్రాధాన్యం ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. అధిష్ఠానం నిర్ణయించిన అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా పనిచేయాలని కోరారు. పార్టీ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి చెందిన 'గొడ్డలి పార్టీ'కి చోటు లేకుండా కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను లక్ష్యంగా చేసుకుని వైసీపీ చేస్తున్న డీఎస్సీ ఆరోపణలు, ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టాలని కార్యకర్తలకు సూచించారు. డీఎస్సీ నియామక ప్రక్రియపై ప్రభుత్వం, అధికారులు వివరణలు ఇచ్చారని, అర్హతలు, ధ్రువపత్రాల పరిశీలన తదితర అంశాలపై అధికారికంగా స్పష్టత ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారని నాయకులు తెలిపారు. పుట్టపర్తి ప్రాంతానికి రానున్న పెట్టుబడులు, పారిశ్రామిక ప్రాజెక్టులు భవిష్యత్తులో నియోజకవర్గ ఆర్థికాభివృద్ధికి గేమ్‌చేంజర్‌గా మారతాయని నాయకులు అన్నారు. నియోజకవర్గంలోని 193 చెరువులకు నీటిని అందించడంతో పాటు రెండు రిజర్వాయర్ల నిర్మాణాన్ని చేపట్టి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.720 కోట్లు వ్యయం కానుండగా, ఇప్పటికే సుమారు రూ.320 కోట్లు ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.20 కోట్లు మంజూరు చేశారని, ఈ నిధులతో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి మరో రూ.7 కోట్లు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పుట్టపర్తి మున్సిపాలిటీలో రూ.136 కోట్లతో ఇంటింటికీ తాగునీరు అందించే ప్రాజెక్టు చేపట్టామని, పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు విలువపై ఇటీవల నివేదికలు కూడా వెలువడ్డాయి. రూ.70 వేల కోట్ల పెట్టుబడులు -- రూ.2,202 కోట్ల అభివృద్ధి పనులు గత రెండేళ్లలో పుట్టపర్తి ప్రాంతానికి సుమారు రూ.70 వేల కోట్ల పెట్టుబడులు వచ్చేలా కృషి జరుగుతోందని నాయకులు తెలిపారు. నియోజకవర్గంలో రూ.2,202 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలో తాగునీరు, రహదారులు, విద్యుత్, విద్య, పారిశ్రామిక పెట్టుబడులు, మౌలిక వసతుల రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. పుట్టపర్తిని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.



## భక్తి భావంతో అన్న సమారాధన నిర్వహించడం అభినందనీయం

**వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి. తిరుపతి అనూష**

విజయవాడ, సెప్టెంబర్ 21 (నేటి శుభోదయ):-పశ్చిమలోని హెచ్‌బీ కాలనీలో విఘ్నేశ్వర ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ నాయకురాలు తిరుపతి అనూష, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముదిరాజ్ శివాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతి అనూష మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా భక్తి శ్రద్ధలతో విఘ్నేశ్వర ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించడం అభినందనీయమన్నారు. భగవంతుడి సేవతో పాటు సమాజ సేవలో భాగంగా భక్తులకు అన్నప్రసాదాలు అందించడం ఎంతో సంతృప్తినిచ్చే విషయమని పేర్కొన్నారు. అన్నదానం మహాదానమని, ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చన్నారు. వినాయక చవితి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించేలా జరగాలని అనూష ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వినాయకుని వేడుకున్నానని అన్నారు. ప్రజలందరూ పండుగలను ఆనందంగా జరుపుకోవడంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని తిరుపతి అనూష పిలుపునిచ్చారు. వినాయక ఉత్సవాల సందర్భంగా అన్న సమారాధనను ఏర్పాటు చేసి భక్తులకు అన్నప్రసాదాలు అందించిన నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో విఘ్నేశ్వర ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## కూటమి పాలనలో పండుగలకు కొత్త కళ టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్



విజయవాడ, సెప్టెంబర్ 20 (నేటి శుభోదయ):-కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పండుగలు, ఆధ్యాత్మిక వేడుకలు ప్రజల భాగస్వామ్యంతో ఎంతో ఘనంగా జరుగుతున్నాయని టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు.సోమవారం విజయవాడ తూర్పులోని పటమట కర్ర గారి బజారులో బడ్డి ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో గద్దె క్రాంతి కుమార్ పాల్గొని వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రోత్సాహం అందిస్తూ ప్రజల భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో వేడుకలు నిర్వహించుకునేందుకు అన్ని విధాలుగా సహకరిస్తోందన్నారు. ప్రజల సంతోషమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. వినాయక చవితి సందర్భంగా నిర్వహించే పూజలు, అన్నసంతర్పణ వంటి కార్యక్రమాలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని అన్నారు. వినాయకుని ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తున్న బడ్డి ఫ్రెండ్ సర్కిల్ సభ్యులను ఈ సందర్భంగా గద్దె క్రాంతి అభినందించారు. ఈ అన్నసమారాధన కార్యక్రమంలో 7 వేల మంది అన్నప్రసాదాలు స్వీకరించారు.

## కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోవాలి

**: అఖిలపక్ష నాయకులు**



యాడికి సెప్టెంబర్ 21 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :మండలంలో ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ప్రభావంతో తీవ్రమైన కరువు పరిస్థితులు నెలకొన్నాయని, వర్షాభావం వల్ల రైతులు సాగు చేసిన పత్తి, వేరుశనగ, కంది పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయారని అఖిలపక్ష పార్టీలు, ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆందోళన వ్యక్తం చేశాయి. సోమవారం యాడికి మండల తహసీల్దార్ ప్రతాప్ రెడ్డికి వారు వినతిపత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని, ముఖ్యంగా యాడికి మండలాన్ని కరువు మండలంగా గుర్తించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగాన్ని ఆదుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.ఖరీఫ్ సీజన్‌లో పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారంతో పాటు తక్షణమే పంటల బీమాను వర్తింపజేయాలని కోరారు. పాడి పశువులు పశుగ్రాసం, తాగునీటి కొరత తీర్చాలని, కరువు ప్రాంత రైతులకు అప్పుల వసూళ్లను వాయిదా వేయాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ కూలీలకు పనులు కల్పించాలని, చిన్న, సన్నకారు రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయాలని డిమాండ్ చేశారు.?అలాగే మండలంలోని అన్ని చెరువులను నీటితో నింపాలని, అనంతపురంలో ఉన్న యాడికి కాలువ బాధ్యలు, పంట కాలువల పనులను పూర్తి చేసి ఆయకట్టుకు నీరు అందించాలని పేర్కొన్నారు. ఉద్యాన పంటల రైతులకు డ్రిప్ ద్వారా నీటిని తరలించేందుకు ఆర్థిక సాయం అందించాలని, చేనేత కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు.?ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ప్రదీప్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి జూటూరు మహమ్మద్ రఫీ, సిపిఐ సీనియర్ నాయకులు శ్రీరాములు, ఓబిరెడ్డి, లక్ష్మయ్య, కుల్లాయి రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, వైసీపీ సీనియర్ నాయకులు వెంకటరామిరెడ్డి, నగరూరు బ్రహ్మానందరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి బషీర్ అహ్మద్, ఎమ్మార్పీఎస్ నాయకులు పుల్లయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

## వానర సేన గణపతి మండపంలో ఘనంగా మహాగణపతి హోమం

**లోకకల్యాణార్థం 51 నారికేళ అష్టద్రవ్య హవనం**

**పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు**



హైదరాబాద్, సెప్టెంబర్ 21:లోకకల్యాణం, సమాజ శాంతిని ఆకాంక్షిస్తూ బేగంబజార్ ఫీల్‌ఖానాలోని వానర సేన గణపతి మండపం వద్ద 'విశ్వ విజయ్ మిత్ర మండల్' ఆధ్వర్యంలో సహస్ర మోదక, 51 నారికేళ అష్టద్రవ్య మహాగణపతి హోమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. మండప నిర్వాహకులు సూరజ్ వ్యాస్, హనుమాన్ వ్యాస్, కమల్ పాండేల నేతృత్వంలో ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు, ప్రధాన పూజారి ప్రసాద్ భట్ శిష్యబృందం ఆధ్వర్యంలో గణపతి పూజ, కలశ స్థాపన, మహాభిషేకం, పుష్పాలంకరణ, 51 కొబ్బరికాయలు-అష్టద్రవ్యాలతో ప్రత్యేక హవనం, మహామంగళహారతి వంటి విశేష పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ శివశంకర్, పవన్ పూజారి, మహావీర్ శర్మ తదితరులు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శివశంకర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.అనంతరం ప్రధాన పూజారి ప్రసాద్ భట్, అతిథులు మాట్లాడుతూ.. మహాగణపతి హోమంలో పాల్గొనడం వల్ల సర్వ విఘ్నాలు తొలగిపోయి, ప్రజలకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని పేర్కొన్నారు. వ్యాపార కేంద్రమైన బేగంబజార్‌లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఈ హోమాన్ని తిలకించేందుకు బేగంబజార్ పరిసర ప్రాంతాల నుంచి మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## స్వయం నియంత్రణతో ఉత్తమ పౌరులుగా ఎదగాలి

**- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వుస్తాల సోమిరెడ్డి**

**- ఆలోచింపజేసిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మధిర వినూత్న కార్యక్రమం**




ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: విద్యార్థులు చెడు వైపుకు వెళ్ళకుండా స్వయం నియంత్రణతో తమకు తాము ఉన్నత మార్గంలో నడుచుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ వి సోమిరెడ్డి అన్నారు. సోమవారం మధిర కిష్టాపురం లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులం ,ముదిగొండ లో గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణ అవగాహన సదస్సు లో ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి రాములు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టడమే కాకుండా తమకు నచ్చిన విదేతర కార్యక్రమాలపై దృష్టి సారించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అదేవిధంగా ప్రతి విద్యార్థి తమ గ్రామాలకు వెళ్లిన తరువాత తన చుట్టూ ఉండే వారిలో ఎవరైనా మత్తుకు అలవాటు పడితే వారిని సక్రమమైన మార్గంలో తీసుకువచ్చే పోలీస్ డిపార్ట్మెంట్కు సమాచారం ఇచ్చి కాపాడాలన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులకు బంధువులకు తమ తోటి వారికి బాదకద్రవ్యాల నివారణ పై అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాలు మనిషిని సమాజంలో క్షీణత కు గురి చేస్తుందని మనిషి తన నియంత్రణ కోల్పోయి సమాజంలో చీత్కరించబడతాడు అన్నారు. ఆరోగ్యకరమైన గొప్ప సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర ఎనలేనిది అన్నారు. అందుకే విద్యార్థి చదువుతోపాటు సమాజ నిర్మాణం పరిసరాల శుభ్రతను చక్కగా ఉండేలా చూసుకోవాలన్నారు హానిసలుగా ఉండడం మరొకరి నియంత్రణలో కాకుండా విద్యార్థులు తమకు తాముగా స్వయం నియంత్రణలో స్వయం శక్తితో ఉత్తమ పౌరులు ఎదగడానికి ప్రయత్నించాలన్నారు అవసరమైన ప్రతి సందర్భంలో ఉపాధ్యాయుల నుండి పూర్తిని పొందాలన్నారు.కార్యక్రమంలో మధిర ఎక్సైజ్ సీఐ బాలకిషన్ మాట్లాడారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఐనాల సైదులు,మధిర ఎక్సైజ్ సీఐ బాలకిషన్, జేవిపి సంజీవరావు, సీనియర్ అధ్యాపకులు కొక్కిరేణి సత్యం , నాగేశ్వరరావు,రామయ్య ఉపాధ్యాయులు సామ్సన్, రేణుక, రాధిక, శరత్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాంస్కృతి కోత్సవాలను జయప్రదం చేయండి

**- తరుణీ తరంగిణీ  లోగో ఆవిష్కరణ లో తులసి**




భద్రాచలం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :::  రాజమహేంద్రవరం నగరంలో అక్టోబర్ 4 వ తేదీన దసరా సందర్భంగా జరగబోయే మహిళా సాంస్కృతి కోత్సవాలను జయప్రదం చేయాలని గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి తులసి కోరారు. ఇందుకు సంబందించిన " తరుణీ తరంగిణీ " లోగో ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక యూటీఎఫ్ భవన్ లో సోమవారం నిర్వహించారు.  ఈ సందర్భంగా గోదావరి బాలోత్సవం ఆర్గనైజింగ్ సెక్రటరీ పి తులసి మాట్లాడుతూ  సాంస్కృతిక రాజధాని అయినా రాజమహేంద్రవరం నగరంలో దసరా సందర్భంగా  తరుణి తరంగిణి పేరుతో మహిళా సాంస్కృతి కోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.  ఇంట బయట అనేకరకాల పనులతో శతమతమవుతున్న మహిళలకు ఆటవిడుపుగాను, మానసిక ఉల్లాసాన్ని కలిగించడం కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.  మహిళల్లో అనేక రకాల అంశాల పట్ల ఆసక్తి ఉందని, ప్రతిభా పాటవాలు వున్నాయని, వాటిని ప్రదర్శించుకోవడానికి ఒక వేదికగా ఈ తరుణీ తరంగిణీ ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.  తరుణీ తరంగిణి, ఆర్ట్స్ కాలేజ్  మహిళా సాధికారత విభాగం ల సంయుక్త ఆధ్వర్యంలో అక్టోబర్ 4వ తేదీ ఆదివారం, ఆర్ట్స్ కాలేజీ ప్రాంగణంలో ఈ ఉత్సవాలు జరుగుతాయని ఆమె తెలియజేశారు.  ఈ సందర్భంగా జానపద నృత్యం, శాస్త్రీయ నృత్యం,  వెస్ట్రన్ డాన్స్, పాటలు పాడటం, ఏకపాత్రాభినయం, విచిత్ర వేషధారణ,  కోలాటం, మైమ్, డ్రాయింగ్, కార్టూన్ గీయటం,  ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, వాయిద్య పరికరాలు  వంటి 18 రకాల అంశాలలో పోటీలను నిర్వహిస్తామని తెలిపారు. ఇది పూర్తిగా మహిళల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమం అని ఆమె తెలిపారు.  ఈ కార్యక్రమంలో కాలేజీ విద్యార్థినిలు, మహిళలు వయసుతో నిమిత్తం లేకుండా 16 సంవత్సరాలనుండి ఏ వయసు వారైనా పాల్గొనవచ్చని తులసి చెప్పారు.  ఈ పోటీలు రెండు విభాగాలుగా జరుగుతాయని కాలేజీ విద్యార్థినులంతా జూనియర్స్ విభాగంగా, మహిళలంతా అంటే గృహిణి లు, ఉద్యోగ ఉపాధ్యాయులు, కార్మికులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ ఇలాంటి వారంతా సీనియర్స్ విభాగం గాను ఈ పోటీలు జరుగుతాయని ఆమె తెలిపారు.  పోటీలకు సంబంధించిన వివరాలతో బ్రోచర్లు కాలేజీలకు అందిస్తామని తెలిపారు.  ఎవరు ఏ పోటీలలో పాల్గొంటారు అనేది ముందుగానే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు.  మహిళలు మేము ఇచ్చే ఫోన్ నెంబర్లకు ఫోన్ చేయడం ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలియజేశారు.  అలాగే ప్రతి పోటీలో ప్రధమ ద్వితీయ తృతీయ బహుమతులు ఇవ్వబడతాయని, పాల్గొన్న ప్రతి ఒక్కరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్ ఇస్తామని కార్యక్రమం రోజు పాల్గొన్న అందరికీ మధ్యాహ్నం భోజన ఏర్పాటు కూడా అక్కడే ఉంటుందని తెలియజేశారు.  పెద్ద ఎత్తున మహిళలు విద్యార్థులు పాల్గొని ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆమె కోరారు.  ఆర్థిక హార్దిక సహకారాలు అందించి ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని ఆమె ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.  ఈ కార్యక్రమం లో  ఉపాధ్యాయ మహిళా విభాగం జిల్లా కన్వీనర్ శ్రీమణి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు విజయ గౌరి, బాలోత్సవం నిర్వాహకులు నవీన, సుజాత విల్సన్, ఝాన్సీ, అంజలి, లక్ష్మి, స్వేచ్ఛ, సౌమ్య పాల్గొన్నారు.




## యనమలకుదురు కరకట్ట వద్ద నిర్మించిన బస్సు షెల్టర్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పెనమలూరు, సెప్టెంబర్ 21 నేటి శుభోదయ:  యనమలకుదురు అవనిగడ్డ వెళ్ళుకరకట్ట వద్ద ఎన్టీఆర్ బస్సు షెల్టర్ ను రాష్ట్ర గౌడ సంక్షేమ మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్ తాడిశెట్టి వీరాస్వామి ల ఆర్థిక సహాయంతో నిర్మించారు. సోమవారం ఎన్టీఆర్  బస్ షెల్టర్ ను పెనమలూరు శాసనసభ్యులు  బోడే ప్రసాద్  తాడిగడప మున్సిపాలిటీ అధ్యక్షులు అనుమోలు ప్రభాకర్ రావు లు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అవసరాలకు తగ్గట్టు కుటమీ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే విధంగా కూటమి ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఉచితం చేసిందని, అంతేకాక ఎన్నో సంక్షేమ పథకాలు అభివృద్ధి చేస్తుందన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ లోకి వైసిపి పార్టీ నుండి తెలుగుదేశం పార్టీలోకి మాజీ ఏఎంసి డైరెక్టర్ దరావత్ రవి ఫ్రెండ్ సర్కిల్ వారి కుటుంబాలు లను పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వెలగపూడి శంకర్ బాబు, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు మొక్కపాటి శ్రీనివాస్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతా గోపీచంద్, మాజీ జడ్పిటిసి సభ్యులు లు బొగ్గవరపు శ్రీనివాసరావు,బిజెపి నాయకులు ఏకుల విజయేంద్ర, జనసేన నాయకులు లంకె శ్రీనివాసరావు, యార్లగడ్డ సుచిత్ర, బుక్య బిచ్చాలి, అంగిరేకుల మురళి, సంగేపు రంగారావు, ఆరేపల్లి శ్రీనివాసరావు బుంగ బాలస్వామి, కొక్కిలిగడ్డ సంగీతరావు, చిరావూరి శేషు, తాడిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## అన్నదానాని ప్రారంభించిన వడ్డెబోయిన నరసింహారావు




ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::  ఖమ్మం నగరంలో గల 25 వ డివిజన్ లోని అద్దంకి వారి వీధి లో  శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ 20వ వార్షికోత్సవం సందర్భంగా కమిటీ వారి ఆధ్వర్యంలో గణేష్ మండపం ముందు మహా అన్నదాన వితరణ చేశారు.  ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు వడ్డెబోయిన ఇందిరా నరసింహ రావు దంపతులు,  బేబీమూన్ హైస్కూల్ అధినేత కేసా వీరన్న  విచ్చేసి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.  ఈ సందర్భంగా వడ్డెబోయిన మాట్లాడుతూ శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ వారిని అభినందించి  ముఖ్య అతిథిగా పిలవడం సంతోషం గా ఉంది అని మహా అన్నదాన వితరణ దాతలు నోముల శ్రీను శైలజ దంపతుల కుటుంబ సభ్యులను అభినందించి కేవలం ఆధ్యాత్మికత పరిమితం కాకుండా ప్రజల మధ్య ఐక్యత సోదర భావం మత సామరస్యాన్ని పెంపొందించాలని అన్నారు.  శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు,  కంబాల అచ్యుత ప్రసాద్ సిబ్బడి బాబూరావు శ్రీలత రామగోని వెంకట రమణ దంపతులు రామగోని నిర్మల లావణ్య  అరుణ సౌమ్య డివిజన్ ప్రముఖులు దాసరి పూర్ణ అనిశెట్టి గిరి బండారు శ్రీనివాస్ గుజ్జరు శ్రీనివాస్ నాగిశెట్టి రాధకృష్ణ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళలకు వర్క్ షాప్




చింతూరు, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: చింతూరు మండలం చింతూరు గ్రామంలో శాపిడ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఎస్.కె అహ్మద్ అలీ ఆధ్వర్యంలో మహిళా నాయకత్వం అభివృద్ధి వర్క్ షాప్ నిర్వహించారు. 8 గ్రామాల నుండి మహిళలు 125 మంది పాల్గొన్నారు. సందర్భంగా సి ఐ గోపాలకృష్ణ మాట్లాడుతూ గిరిజన మహిళలు అనేక సమస్యలతో గురి అవుతున్నారని, అభివృద్ధి వెనకబడి ఉన్నారని, ఆదివాసి బిడ్డలను మెరుగుపరచాలని ఉద్దేశ్యంతో ఈ  సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆదివాసి మహిళలకు సంస్థ ఆధ్వర్యంలో కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు పంపిణి చేసారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సంతోష్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ దొర, ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ సాయి చందు,గవర్నమెంట్ డాక్టర్ గైనకాలజిస్ట్ శశికళ, సాపిడి సంస్థ ఆర్గనైజర్స్ బంగారు జానకి సోడి లక్ష్మి తురం నాగరాజు అంజలి కీర్తి అశ్విని పాల్గొన్నారు.



## గణేష్ నగర్‌లో ఘనంగా అన్నదాన కార్యక్రమం



ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :::  శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ, టి ఆర్ ఆర్   ఆర్తో అండ్ యాక్సిడెంట్ కేస్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో గణేష్ నగర్,  టి ఆర్ ఆర్ తో యాక్సిడెంట్లు కేర్ లో భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.  ఈ కార్యక్రమం 48వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తోట గోవిందమ్మ, తోట రామారావు, డాక్టర్ తోట లక్ష్మణ్ ఆధ్వర్యంలోలి నిర్వహించబడింది.వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాన్ని శీలంశెట్టి వీరభద్రం  నిర్వహించిన కమిటీ సభ్యులను స్థానికులు అభినందించారు.ఈ సందర్భంగా తోట గోవిందమ్మ--తోట రామారావు మాట్లాడుతూ, గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తులకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని, అన్నదానం చేయడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవా భావాన్ని పెంపొందించవచ్చని అన్నారు. కార్యక్రమంలో శీలంశెట్టి వీరభద్రం మాజీ కార్పొరేటర్ శేషగిరి మాజీ కార్పొరేటర్,  శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, అరవింద పెళ్లి అరిగే కుమార్ విక్రం అనిల్ రాము స్థానిక నాయకులు, భక్తులు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.



## అన్నదానం ఎంతో పుణ్యం : పాలెపు విజయ వెంకటరమణ



ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: అన్నదానం ఎంతో పుణ్యం అని కాంగ్రెస్ జిల్లా నాయకులు పాలెపు వెంకటరమణ, డివిజన్ మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ తెలిపారు. ఖమ్మం నగరంలో గల 44 వ డివిజన్ లెనిన్ నగర్ లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన 44 వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ పాలెపు విజయ వెంకటరమణ భక్తులకు అన్న వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 13 సంవత్సరాలుగా ఈ మండపం లోనీ మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక తత్వం ఉట్టిపడేలా ఒక మంచి సాంప్రదాయాన్ని పాటిస్తూ పలువురకి ఆదర్శంగా నిలుస్తున్నారు అన్ని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం నిర్వహిస్తున్న మహిళ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు . ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ నాయకులు, మైనార్టీ నాయకులు మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## ఆపదలో ముగ్గురికి జేసీ ప్రభాకర్ రెడ్డి చేయూత

### ప్రమాద బాధితులను కాపాడిన తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్



తాడిపత్రి, సెప్టెంబర్ 21 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక : సోమవారం అనంతపురంలో ఏర్పాటు చేసిన ధర్నా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. మార్గమధ్యంలో ముచ్చుకోట సమీపంలో జరిగిన ఆటో ప్రమాదాన్ని గమనించిన ఆయన, వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో గాయపడిన బాధితులను చూసి చలించిన జేసీ ప్రభాకర్ రెడ్డి తన సొంత వాహనంలోనే వారిని చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం తాడిపత్రి ఆసుపత్రి వైద్యులతో ఫోన్ ద్వారా మాట్లాడి క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సమయానికి స్పందించి వైద్యానికి సాయపడిన జేసీ ప్రభాకర్ రెడ్డి సమయస్ఫూర్తిపై స్థానికులు, బాధితుల కుటుంబసభ్యులు ప్రశంసలు కురిపించారు...

## గోపాలపురంలో ఘనంగా అన్నదానం

– భక్తి భావంతో సేవా కార్యక్రమం

– పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజలు



ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల ఎనిమిదో డివిజన్ గోపాలపురంలో దేవభక్తిని కిషోర్ బాబు గృహంలో సోమవారం అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి స్థానికంగా విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయకుమార్, ఆరో డివిజన్ మాజీ కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, నాలుగో డివిజన్ మాజీ కార్పొరేటర్ దండా జ్యోతి రెడ్డి, 14వ డివిజన్ మాజీ కార్పొరేటర్ కురాకుల వలరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భక్తితో నిర్వహించే సేవా కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. అన్నదానం వంటి కార్యక్రమాలు ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడంతో పాటు, సమాజంలో సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐదో డివిజన్ నాయకులు కోలేటి రాధాకృష్ణ, తొట్టి కొమరయ్య, ఎనిమిదో డివిజన్ నాయకులు కందాల వీరేంద్ర గౌడ్, వాంకుడోత్ సురేష్ నాయక్, రాఘవేంద్రతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## బూరుగుపూడి గ్రామంలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి 'కంటే వినయ్ తేజ' అండ..!

– బాధితులకు రూ 10 వేలు ఆర్థిక సహకారాన్ని అందించిన వినయ్ తేజ.. !



కోరుకొండ, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె);తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలంలోని బూరుగుపూడి గ్రామంలో సోమవారం ఉదయం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మంగం శివ, అమ్ములు దంపతులు నివాసం ఉంటున్న ఇంట్లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి, అనంతరం గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది.ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రితో పాటు ముఖ్యమైన ధ్రువపత్రాలు, ఇంటర్ సర్టిఫికెట్లు, వస్త్రాలు, తదితర వస్తువులు పూర్తిగా కాలిపోయి కేవలం కట్టు బట్టలుతో మిగిలారు. ఈ ఘటనలో సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధిత కుటుంబం తీవ్ర ఆవేదనతో తెలిపింది. శివ, అమ్ములు దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం వారు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు.ప్రమాద విషయం తెలుసుకున్న కంటే తేజ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించి, కష్టకాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిట్టా కృష్ణ, పెనుగుల ప్రకాష్, మెల్లిమి వెంకటేష్, ఇంజె బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

## "తాడేపల్లిగూడెంలో ప్రారంభమయిన షటిల్ టోర్నమెంట్"



తాడేపల్లిగూడెం సెప్టెంబర్ 21 (నేటి–శుభోదయ) తాడేపల్లిగూడెం ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆద్వర్యంలో వార్షికోత్సవ వేడుకల్లో బాగంగా నిర్వహిస్తున్న షటిల్ టోర్నమెంట్ సోమవారం ప్రారంభమయింది. ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ సంఘ అద్యక్షుడు తిరుమల సూరిబాబు ఈ పోటీలను ప్రారంబించారు. ఈ పోటీలు జూనియర్స్ సీనియర్ విభాగాలుగా 13 జట్లు తలపడుతున్నాయి. ఈ పోటీలు ఉత్సాహంగా సాగా తున్నాయి. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు బేట్ర శ్రీను, యెలిశెట్టి వాసు, బసివిరెడ్డి సుబాకర్, నార్ని సుధాకర్, రాగిరెడ్డి వరప్రసాద్, మాకా శ్రీనివాస్, కె.నరసింహమూర్తి, వాకర్స్ కార్యదర్శి ప్రత్తి శ్రీనివాస్, కోశాధికారి సారధి తదితరులు పాల్గొన్నారు.

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలి

: రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

– 2026--27లో భూసేకరణకు రూ. 6 వేల కోట్ల నిధులు విడుదల

– అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులు తక్షణమే పూర్తి చేయాలి

– నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర మంత్రులు, సీఎస్




ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ, అటవీ భూముల పరిహారం, పునరావాసం--పునరావాస పునరుద్ధరణ (ఆర్అండ్ఆర్) పనుల పురోగతిపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఖమ్మం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ, అటవీ భూముల పరిహారం, ఆర్అండ్ఆర్ పనులకు అవసరమైన నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని తెలిపారు. నీటిపారుదల శాఖకు కేటాయించిన నిధులకు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులను బదిలీ చేసి అవసరమైన మేరకు నిధులు సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణకు మొత్తం రూ.6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఇప్పటికే రూ.1,050 కోట్లు, మరోసారి రూ.1,500 కోట్లు కలిపి మొత్తం రూ.2,550 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విడుదలైన నిధుల్లో అధిక భాగం ఇప్పటికీ అధికారుల ఖాతాల్లోనే ఉండి, లబ్ధిదారులకు చేరకపోవడం ఆందోళనకరమని అన్నారు.జిల్లా కలెక్టర్లు భూసేకరణ లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. నిధులు సరిపోకపోయినా, ఇతర కారణాల వల్ల చెల్లింపులు సాధ్యం కాకపోయినా ఆ వివరాలను ప్రభుత్వానికి పంపి అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. విడుదలైన నిధులను అధికారుల వద్ద ఉంచి పనులను పెండింగ్‌లో పెట్టవద్దని స్పష్టం చేశారు. భూసేకరణ పనులకు ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు.నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు రెవెన్యూ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ భూసేకరణ పురోగతిని ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. ఇప్పటికే విడుదలైన రూ.2,550 కోట్లను పూర్తిగా వినియోగించిన అనంతరం అవసరాన్ని బట్టి అదనపు నిధులు విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. భూసేకరణ ప్రక్రియలో రైతుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి అన్నారు. కలెక్టర్లు, ఉన్నతాధికారులు రైతులతో నేరుగా చర్చించి స్నేహపూర్వక వాతావరణంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. భూసేకరణ నిబంధనల ప్రకారం జరగాలని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా పరిహారం మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నీటిపారుదల ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రి బడ్జెట్‌కు అదనంగా ఇతర వనరుల నుంచి నిధులు సమకూర్చి మంజూరు చేస్తున్నందున అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని భూసేకరణ పనులను పూర్తి చేయాలని మంత్రి సూచించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లిపాకల రిజర్వాయర్ పనులు పూర్తయ్యేలా భూసేకరణను ప్రాధాన్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలు ఎదురైతే హైదరాబాద్‌లోని భూసేకరణ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించుకోవాలని మంత్రి సూచించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు సంబంధించిన పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యతగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అవార్డు జారీ చేసిన తరువాత కూడా చాలా కాలం పరిహారం అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరిగి, అధిక పరిహారం కోసం డిమాండ్లు పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టుల పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించి, పనులను వేగవంతం చేయాలని సూచించారు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనులకు సంబంధించి సుమారు రూ.3,100 కోట్ల విలువైన పనులు గుర్తించగా, రూ.2,514 కోట్ల మేర నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. పరిహారం నేరుగా రైతులకు చేరేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుని భూసేకరణ ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో అధిక మొత్తంలో పరిహారం కోరుతున్న కారణంగా కొంత ఆలస్యం జరుగుతోందని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఇర్రిగేషన్ సిఈ వాసంతి, డిసిఎస్ఓ చందన్ కుమార్, ఇర్రిగేషన్ ఈఈ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ ఫలాలు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు దామాషా ప్రకారం సంపూర్ణంగా అందాలి

: తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ప్రతి నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే ని పకడ్బందీగా నిర్వహించాలి

గురుకులాల్లో మౌలిక వసతులు కల్పించాలి

– పారిశుద్ధ్య కార్మికులకు కోటి రూపాయల భీమా కల్పించాలి

– జిల్లాలోని అన్ని అంగన్వాడీలకు స్వంత భవనాలు నిర్మించాలి

– ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వారి ప్రాంతాల్లోనే ఖర్చు చేయాలి

– ఎస్సీ, ఎస్టీ కమీషన్ సభ్యులు కుర్సం నీలాదేవి, రాంబాబు నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి, అధికారులతో భూమి, సర్వీసెస్, అట్రాసిటీ కేసులపై సమీక్ష నిర్వహించిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్




ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: దామాషా ప్రకారం ప్రభుత్వ ఫలాలు సంపూర్ణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందాలని, ఈ దిశగా అధికారులు కృషి చేయాలని రాష్ట్ర షెడ్యూల్ కులాల, షెడ్యూల్ తెగల కమీషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కమీషన్ సభ్యులు కుర్సం నీలాదేవి, రాంబాబు నాయక్, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి భూమి, సర్వీసెస్, అట్రాసిటీ కేసులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల వారీగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల వివరాలు, ఎస్సీ, ఎస్టీ ల కోసం పథకాల అమలు, అట్రాసిటీ కేసుల పురోగతిపై సమీక్షించారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ యువతకు స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే రాజీవ్ యువ వికాసం కార్యక్రమాన్ని వచ్చే నవంబర్ మాసంలో ప్రభుత్వం ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించే జనరల్ బాడీ సమావేశాల్లో అంగన్వాడీ భవనాల స్థల సేకరణ, నిర్మాణాల విషయమై చర్యలు వేగవంతం చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు, నాణ్యమైన సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద కేటాయించిన నిధులను తప్పనిసరిగా ఆయా వర్గాల నివాస ప్రాంతాలు, తండాలు, కాలనీల అభివృద్ధికి మాత్రమే వినియోగించాలని స్పష్టం చేశారు. పంచాయతీ రాజ్, మున్సిపాలిటీ శాఖల పరిధిలోని సానిటేషన్ వర్కర్లందరికీ మెరుగైన సామాజిక భద్రత, సురక్షిత పని వాతావరణం కల్పించే చర్యలను తక్షణమే అమలు చేయాలన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు కోటి రూపాయల భీమా కల్పించాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణ త్వరగా పూర్తి చేసి బాధితులకు పరిహారం, న్యాయం అందించాలన్నారు. ప్రతి నెల చివరి వారంలో నిర్వహించే 'సివిల్ రైట్స్ డే' కార్యక్రమాల్లో తహశీల్దార్లు, స్టేషన్ హౌజ్ అధికారి స్థాయి అధికారులు తప్పనిసరిగా పాల్గొనేలా చూడాలన్నారు. ప్రజల్లో మూఢ నమ్మకాలు, చట్టాలపై అవగాహన కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలపై చైతన్యం తేవాలన్నారు. జిల్లాలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి కృషి చేయాలని చైర్మన్ సూచించారు. మంగళవారం జరగనున్న హైకోర్టు కమిటీ మీటింగ్ దృష్ట్యా, ఎస్సీ/ఎస్టీ అట్రోసిటీ కేసుల పెండింగ్ బకాయిలు, ఇంటర్–కాస్ట్ మ్యారేజెస్ ప్రోత్సాహకాలు, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కమిషన్‌కు సమర్పించాలన్నారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ఏ అంగన్‌వాడీ కేంద్రం ప్రైవేట్ భవనాల్లో ఉండకూడదనే లక్ష్యంతో స్వంత భవనాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. మహిళల నుంచి వచ్చిన డిమాండ్ మేరకు జిల్లాలో దాదాపు 494 విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కోటా ప్రకారం అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ఇళ్ల కేటాయింపులో సంపూర్ణ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలోని 19 సంక్షేమ పాఠశాలలు ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్నందున, వాటికి మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేశామని తెలిపారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ కింద ప్రతి నియోజకవర్గానికి ఒకటి చొప్పున లభించిన 5 స్కూళ్లకు మ్యాపింగ్ చేసి, ప్రైవేట్/శిథిలావస్థలో ఉన్న హాస్టళ్ల విద్యార్థులను ప్రాధాన్యత ప్రకారం ఇక్కడికి తరలిస్తామని అన్నారు. బోనకల్, రఘునాథపాలెంలలోని స్కూళ్లు వచ్చే విద్యాసంవత్సరం నాటికి, మిగిలినవి వచ్చే ఏడాది డిసెంబర్/జనవరి నాటికి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జిల్లాలో 797 కేసుల్లో 930 బాధితులకు 12 కోట్ల 42 లక్షల 50 వేల పరిహారం మంజూరు కాగా, 9 కోట్ల 5 లక్షలు అందజేసినట్లు, మిగతా నిధులు అందగానే చెల్లించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగానికి విలువైన సూచనలు, సలహాలు అందించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్‌పర్సన్, సభ్యులకు జిల్లా యంత్రాంగం తరపున ధన్యవాదాలు తెలిపారు. సమీక్షల్లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, జిల్లాలో 2017 నుండి ఇప్పటి వరకు 878 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు అయ్యాయన్నారు. ఇందులో 194 ఫాల్స్ కేసులు కాగా, 684 కేసుల్లో 653 కేసులకు ఛార్జ్ షీట్ దాఖలు, 8 కేసులకు శిక్షలు పడగా మిగతా కేసులు వివిధ స్థాయిల్లో ఉన్నాయన్నారు. బాధితులకు న్యాయం జరిగేలా, పరిహారం పొందేలా విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, శిక్షణ సహాయ కలెక్టర్ పారస్ కుమార్, కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్, కమిటీ అనధికార సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఏసీపీలు, ఎంపిడిఓ లు, మునిసిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## పర్యావరణహితంగా గణేశ ఉత్సవాలు నిర్వహించిన వారికి ప్రశంసా పత్రాలు



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 21 నేటి శుభోదయ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని అనంతపురము నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో పర్యావరణహిత గణేశ ఉత్సవాల పోటీలు నిర్వహించారు. ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించడం, పర్యావరణహిత పద్ధతుల్లో గణేశ ఉత్సవాలను నిర్వహించేలా ప్రోత్సహించడం ఈ పోటీల ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.ఈ పోటీలలో భాగంగా మట్టి వినాయక విగ్రహాల ఏర్పాటు, సహజసిద్ధమైన వస్తువులతో అలంకరణలు, ప్లాస్టిక్ మరియు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించడం, పర్యావరణహిత పద్ధతులను పాటించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు.పర్యావరణహితంగా గణేశ ఉత్సవాలను నిర్వహిస్తూ పోటీలలో పాల్గొన్న కింది మండపాల నిర్వాహకులకు అనంతపురము నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత రావు చేతుల మీదుగా (ప్రశంసా పత్రాలు) అందజేశారు. 1. గాయత్రి చౌక్ -- 1వ రోడ్డు 2. విజ్ఞరాజా చౌక్ -- 2వ రోడ్డు. 3. భవాని చౌక్ -- 3వ రోడ్డు 4. శ్రీ గణేష్ ఉత్సవ సమితి -- అరవింద్ నగర్.ఈ సందర్భంగా కమిషనర్ జశ్వంత రావు మాట్లాడుతూ, పండుగలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మట్టి వినాయక విగ్రహాల వినియోగం, సహజసిద్ధమైన అలంకరణలు, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించడం వంటి పర్యావరణహిత చర్యలను ప్రజలు భవిష్యత్తులో కూడా కొనసాగించాలని కోరారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. రాజా రవీంద్రనాథ్ చౌదరి మాట్లాడుతూ, పర్యావరణహిత గణేశ ఉత్సవాల నిర్వహణ ద్వారా ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై మరింత అవగాహన పెంపొందుతుందని తెలిపారు. పర్యావరణహిత పద్ధతులను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించిన మండపాల నిర్వాహకులను అభినందించారు.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA, VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .

## వాటర్ ప్లాంట్ పనులను పరిశీలించిన బల్లా పల్లవి



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 21 నేటి శుభోదయ : బత్తాయి సీజన్ ముగియడంతో యార్డ్ మొత్తం శుభ్రం చేయాలని మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లాపల్లవి సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆర్ ఓ ఆర్ వాటర్ ప్లాంట్ పనులను పరిశీలించారు. త్వరగా వాటర్ ప్లాంట్ పనులను పూర్తి చేసి రైతులకు శుద్ధ జలాన్ని అందజేయడానికి చీరలు చేపట్టాలని ఆమె సూచించారు.

## జిల్లాలో మంచినీటి సమస్య తలెత్తకూడదు

**వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు రైతులు పంటలు సాగు చేయాలి**

**జిల్లాలో 100% అక్షరాస్యత సాధించాలి**

**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 21 నేటి శుభోదయ : అనంతపురం జిల్లాలో ఎక్కడ కూడా మంచి నీటి సమస్య తలెత్తకూడదని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ తాసిల్దార్ లు, ఎంపీడీవోలు ఏపీవోలతో మంచినీటి సమస్య, వ్యవసాయం, అక్షరాస్యత, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రస్తుత వర్షాభావ పరిస్థితులలో జిల్లాలో ఎక్కడ కూడా మంచినీటి సమస్య తలెత్తకూడదన్నారు. కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ కు మంచినీటి సమస్య ఉందని ఎక్కడైనా ఫిర్యాదులు వచ్చినట్లయితే 24 గంటల లోపల సమస్యను పరిష్కరించాలన్నారు. నీటి సమస్య అధికంగా ఉన్న ప్రాంతాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మంచినీటి సమస్యను సీరియస్ గా తీసుకొని పనిచేయాలన్నారు. ఎల్ నినో సమస్యను దృష్టిలో ఉంచుకొని వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాల మేరకు రైతులు పంటలు సాగు చేసే విధంగా చూడాలని వ్యవసాయ శాఖ జెడిఎ కు సూచించారు. ఎల్ నినో సమస్యను ఎదుర్కొనేందుకు వ్యవసాయ శాఖ ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ తదితర లైన్ డిపార్ట్మెంట్స్ సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి పౌరుడిని అక్షరాస్యుడిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం "ఉల్లాస్ -- అక్షరాంధ్ర" కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు వయోజన విద్య అధికారులు సిబ్బంది వాలంటీర్లు సమన్వయంతో పనిచేసి 100% అక్షరాస్యత శాతాన్ని సాధించాలన్నారు. కొంతమంది వాలంటరీలు గౌరవ వేతనం లేకుండానే నిరీక్షరాశులను అక్షరాసులుగా తీర్చిదిద్దేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు.



ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కింద వేతనదారులు, డిఆర్డిఎ పరిధిలోని మహిళలు, మెప్మా పరిధిలోని పొదుపు సంఘాల నిరక్షరాశులను గుర్తించి విద్యావంతులుగా మార్చాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పలు అంశాలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మలోల, డిఆర్డిఏ పిడి శైలజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాయి రెడ్డి, డ్వామా పిడి, ఏపీఎంఐపి పిడి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రసాయనిక శాస్త్ర విద్యార్థులు జ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలను అలవర్చుకోవాలి

**-డాక్టర్ ఆర్. సత్యనారాయణ**



విజయవాడ, సెప్టెంబర్ 21 నేటి శుభోదయ: రెయిన్బో వీక్ సెలబ్రేషన్స్ -- 2026 శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో ఘనంగా నిర్వహించారు. స్టూడెంట్ ఓరియెంటేషన్ మరియు రెయిన్బో వీక్ సెలబ్రేషన్స్ --2026లో భాగంగా మొదటి రోజు గెస్ట్ లెక్చర్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ . జి . ఆర్ సత్యనారాయణ "కెరీర్ ఒరిటేషన్ ప్రోగ్రామ్ ఇన్ కెమిస్ట్రీ " అనే అంశంపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ జి . ఆర్ . సత్యనారాయణ మాట్లాడుతూ రాబోయే కాలంలో కెమిస్ట్రీ విద్యార్థులకు ఉన్న అవకాశాలు, నేటి ఆధునిక ప్రపంచంలో కెమిస్ట్రీ ప్రాముఖ్యత, విద్యార్థులు తమ కెరీర్ను ఎలా నిర్మించుకోవాలి అనే అంశాలపై సవివరంగా వివరించారు. బయోమెడికల్, ఆర్గానిక్ సింథసిస్, ఫార్మాస్యూటికల్, అగ్రో కెమికల్స్, పాలిమర్ కెమిస్ట్రీ, నానోకెమిస్ట్రీ, మెటీరియల్ సైన్స్, బయోకెమిస్ట్రీ తదితర రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. రసాయన శాస్త్రాన్ని అభ్యసించే విద్యార్థులు ప్రస్తుత కాలంలో జ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, పరిశోధనా దృక్పథాన్ని అలవరచుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ ఆసక్తి, సామర్థ్యాలకు అనుగుణంగా ఉన్నత విద్య, పరిశోధన, పరిశ్రమలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, కెమికల్ ఇండస్ట్రీస్, ల్యాబొరేటరీలు, పర్యావరణ సంబంధిత రంగాలు తదితర విభాగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎం స్సీ,పిహెచ్ .డి . వంటి ఉన్నత విద్య అవకాశాలు, వివిధ పోటీ పరీక్షలు, ఫ్యాకల్టీ రిక్రూట్మెంట్, కెమికల్ ఇండస్ట్రీస్, ల్యాబొరేటరీలు, ఫార్మాస్యూటికల్ కంపెనీలు, పర్యావరణ సంబంధిత పరిశ్రమలు తదితర రంగాల్లో ఉన్న అవకాశాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి . వి . దుర్గావతి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, కెరీర్పై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు ఇవి దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శాస్త్ర విభాగ అధిపతి అండ్ రెయిన్బో వీక్ సెలబ్రేషన్స్ ఇన్చార్జ్ ఎం . సుభాషిణి, రసాయన శాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## దేవీపట్నంలో రేపు టీడీపీ మండల విస్తృత స్థాయి సమావేశం

నేటి శుభోదయం ప్రతినిధి దేవి పట్నం : తెలుగుదేశం పార్టీ దేవీపట్నం మండల విస్తృత స్థాయి సమావేశం రేపు మంగళవారం, సెప్టెంబర్ 22, 2026) మధ్యాహ్నం 2:00 గంటలకు ఇందుకూరుపేటలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుంది.ఈ సమావేశానికి రంపచోడవరం శాసనసభ్యురాలు మిర్యాల శిరీషా దేవి గారు ,పోలవరం జిల్లా ఇంచార్జ్ కె.సత్తిబాబు గారు నియోజకవర్గ పరిశీలకులు బాలాజీ, గారు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. స్థానిక సంస్థలు బలోపేతం, భవిష్యత్ కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.ఈ సందర్భంగా ఏరియా ఇన్చార్జిలు బూత్ కన్వీనర్లు అనుబంధ సంఘాల వారు నియోజకవర్గ కమిటీలలో ఉన్నవారు గ్రామ కమిటీ అధ్యక్షులు కార్యదర్శులు మండలంలోని , కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుచున్నాము.

## చీఫ్ సెక్రటరి సాయికుమార్ కు వినతి పత్రం అందిస్తున్న రాష్ట్ర మహిళా విభాగపు అధ్యక్షురాలు డాక్టర్ పామర్తి లీలావతి



అమరావతి, సెప్టెంబర్ 21నేటి శుభోదయ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ కె ఆర్ సూర్యనారాయణ గారి నాయకత్వంలో 18 శాఖల అధిపతులు ఐక్యవేదికగా ఐక్యవేదిక సభ్యులు సోమవారం ఆయా శాఖల సమస్యలను గురించి పిఆర్సి ఆ సంఘంలో నెలకొనే ఉన్న పూర్వపు సమస్యలను గురించి చర్చించేందుకు ఈరోజు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సాయి కుమార్ ని కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఒక్కొక్క విభాగాన్ని అధ్యక్షులు పరిచయం చేస్తూ ఆయా శాఖలో ఉండేటువంటి సమస్యల గురించి వివరంగా చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకువచ్చారు ఆర్డర్లో ఆర్డర్ ను వ్యతిరేకిస్తుందని ఆ ఆర్డర్ లోకపు ఇష్టమైనదని కేవలం టాలెంటెడ్ పర్సన్స్ లేదా నిపుణత కలిగిన అభ్యర్థులు కాబోయే నిరుద్యోగులు ఆయా లోపలికి కేవలం ఆయా ప్రాంతాలకే పరిమితం అవడం వలన అటు అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా నష్టం వాటిల్లుతుందని తెలియజేశారు డాక్టర్ పామర్తి లీలావతి మహిళా ఉద్యోగం ఎదుర్కొంటున్న సమస్యల గురించి వాటిని పరిష్కారం దశగా ఆలోచించాలని వినతి పత్రం సమర్పించారు



## నేడు రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ శాఖల మంత్రి నారా లోకేష్ జిల్లా పర్యటన

**రాప్తాడులో పర్యటించనున్న మంత్రి నారా లోకేష్.**

**-జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**

అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 21 నేటి శుభోదయ: ఈనెల 22వ తేదీన అనంతపురం జిల్లాలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ ఁ కమ్యూనికేషన్ మరియు ఆర్టీజీ శాఖల మంత్రివర్యులు నారా లోకేష్ పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.మంత్రి నారా లోకేష్ ఈనెల 22వ తేదీన మంగళవారం ఉదయం 07.45 గంటలకు బేగంపేట ఎయిర్పోర్ట్ నుంచి బయలుదేరి ఉదయం 08.30 కి శ్రీ సత్యసాయి ఎయిర్పోర్ట్ పుట్టపర్తికి చేరుకుంటారు. సత్యసాయి ఎయిర్పోర్ట్ పుట్టపర్తి నుంచి ఉదయం 08.45 గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి ఉదయం 10:15 గంటలకు అనతపురము జిల్లా రాప్తాడు మండలం ఁ గ్రామంకు చేరుకుంటారు. ఉదయం 10.15 నుండి 11.15 గం.ల వరకు పార్టీ కార్యకర్తలు స్థానిక ప్రజల స్వాగతం, డాక్టర్ ఎన్.టి.రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొంటారు. రాప్తాడు గ్రామం ఁ మండలం నుంచి ఉదయం 11.15 గంటలకు బయలుదేరి ఉదయం 11.20 గంటలకు రాప్తాడు కేదర్ సమావేశ స్థలంకు చేరుకుంటారు. మధ్యాహ్నం 01.00 నుండి 03.30 వరకు పార్టీ క్యాడర్తో సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 03.30 గంటలకు రాప్తాడు గ్రామం ఁ మండలం నుంచి బయలుదేరి సాయంత్రం 05:00 గంటలకు శ్రీ సత్యసాయి ఎయిర్పోర్ట్ పుట్టపర్తికి చేరుకుంటారు. సాయంత్రం 05.10 గంటలకు సత్యసాయి ఎయిర్పోర్ట్, పుట్టపర్తి నుంచి బయలుదేరి విజయవాడ వెళ్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా గురజాడ అప్పారావు జయంతి వేడుకలు



అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 21 నేటి శుభోదయ-అనంతపురము జిల్లా కేంద్ర గ్రంథాలయం నందు ఘనంగా ప్రముఖ కవి, రచయిత, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ముఖ్య అతిథి గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సిబ్బంది తో కలసి గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా 1నివాళులర్పించారు.ఈ సందర్భంగా చైర్మన్ వడ్డే వెంకట్ మాట్లాడుతూ గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యానికి, సమాజ సంస్కరణకు అందించిన విశిష్ట సేవలను వారు స్మరించుకున్నారు. సమాజంలోని మూఢనమ్మకాలు, సామాజిక దురాచారాలను తన రచనల ద్వారా ఎత్తిచూపి ప్రజల్లో చైతన్యం కల్పించిన గురజాడ అప్పారావు సాహితీ సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.తెలుగు భాషను ప్రజలకు మరింత చేరువ చేస్తూ వ్యవహారిక భాషకు ప్రాధాన్యత కల్పించడంలో గురజాడ అప్పారావు గారి కృషి విశేషమైనదని తెలిపారు. ఆయన రచనలు నేటికీ సమాజానికి స్ఫూర్తినిస్తున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థకార్యదర్శి జె శివప్రసాద్, డిప్యూటీ లైబ్రేరియన్ పి కమ్మన్న, సహాయ గ్రంథాలయాధికారి గోవిందు, జూనియర్ అసిస్టెంట్ రామాంజినమ్మ, జీవన సిబ్బంది ఇందిరమ్మ, ముత్యాలమ్మ, శిరీషా, సరస్వతమ్మ నాగరాజు గంగాధర్ పాఠకులు పాల్గొన్నారు.

## అఖిలభారత స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన ద్వారబంధాల చంద్రయ్యనాయుడు నాటిక

**గుడివాడ కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్**



శ్రీకాకుళం, సెప్టెంబర్ 21 నేటి శుభోదయ : నభూతో నభవిష్యతే చందంగా ఎనిమిది రాష్ట్రాల నుంచి నాటికల పోటీల్లో పాల్గొని నువ్వా నేనా అనే విధంగా తమ హావభావాలతో నాటికలను రసవత్తరంగా సాగించి న్యాయమూర్తులకే చాలెంజ్ గా ఒకరికొకరు పోటా పోటీగా నటించి తమ నటవిస్వరూపాన్ని ప్రదర్శించారు. గత ఏడాదిగా రెండు తెలుగు రాష్ట్రాలలో ఎక్కడ ప్రదర్శించినా ఉత్తమ నాటికగా, ఉత్తమ నటుడు, ఉత్తమ హాస్య నటుడు, సహాయ నటుడుగా అనేక అవార్డులు అందుకున్న తెలుగు నాటిక 'ద్వార బంధాల చంద్రయ్యనాయుడు ' శ్రీకాకుళం జిల్లా శ్రీకాకుళంలో జరిగిన అఖిలభారత స్థాయిలో ద్వితీయ స్థానం సాధించడం విశేషం. ద్వారబంధాల చంద్రయ్యనాయుడు లో నటించిన ప్రతి నటుడు అభినందనీయులు ముగిసిన బహుభాషా నాటిక పోటీలుశ్రీకాకుళం కళాక్షేత్రం శ్రీ సుమిత్ర కళాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత బహుభాషా నాటిక పోటీలు ఆదివారంతో ముగిశాయి. బాపూజీ కళామందిర్లో చివరి రోజు తెలుగు నాటిక 'ద్వారబంధాల చంద్రయ్య నాయకుడు', తెలుగు నాటిక లి'భగత్సింగ్'లితో పాటు మరాఠీ నాటికలను ప్రదర్శించారు.కళాకారులను సుమిత్ర కళాసమితి నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో ఇప్పా శంకరయ్య, పి. రామకృష్ణరావు, లండ రుద్రమూర్తి, శక్తి చక్రవర్తి, జగన్నాథ్ సేఠ్, నక్క శంకరావు, గుత్తి చిన్నారావు, మండవల్లి రవి, కిల్లాన పల్లవరావు, కొమర్రు సురేష్ తదితరులు పాల్గొన్నారు.అసోం రామానికిచ్చిన 'జీవి ట్రస్ట్' (అస్సామీ), గుడివాడకు చెందిన 'ద్వారబంధాల చంద్రయ్య నాయుడు' (తెలుగు), ముంబైకి చెందిన 'సూఫ్' (మరాఠీ) తదితర నాటికలు ప్రదర్శించబడ్డాయి.ద్వితీయ బహుమతి అందుకున్న 'ద్వారబంధాల చంద్రయ్య' నాటిక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ బృందంలోని కళాకారులకు జ్యూరీ అవార్డులు కూడా లభించాయి.అలాగే ఉత్తమ నటన, దర్శకత్వం తదితర విభాగాల్లో ప్రతిభ చూపిన కళాకారులకు బహుమతులు అందజేశారు. ముఖ్యంగా మూడు రోజుల పాటు జరిగిన ఈ బహుభాషా నాటిక పోటీలు విజయవంతంగా ముగిశాయి.



## ఆధ్యాత్మిక నగరంగా ఒంగోలు

**- శ్రీగిరి గిరి ప్రదక్షిణ ప్రారంభంతో చారిత్రక వైభవం.**



ఒంగోలు, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: ఆధ్యాత్మిక నగరంగా ఒంగోలు నగరం అడుగులు ముందుకు వేస్తుంది. ఒంగోలు నగరం ఎన్నో దేవీ దేవతామూర్తుల ఆలయాలకు నెలవై ఉన్నది. ముఖ్యంగా వానిలో కేశవ స్వామి పేటలో ప్రసన్న లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం, కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయం, శ్రీగిరి పై శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం మరియు రామగిరి పై శ్రీ కోదండ రామస్వామి వారి ఆలయాలు ఎంతో ప్రసిద్ధి చెందినవి, అలాగే అమలనాధుని వారి వీధిలో 110 సంవత్సరాల క్రితం నిర్మాణం చేసిన ఆర్యవైశ్యుల ఇలవేల్పు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, కొత్తపట్నం బస్టాండ్ మరియు రంగారాయుని చెరువు వద్ద గల పశుతీశ్వర ఆలయములు, మహాలక్ష్మి ఆలయం భక్తులకు కొంగుబంగారమై ఉన్నాయి. భక్తులు తమ కోర్కెలను భగవంతునికి నివేదన చేసుకుంటూ ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణిస్తున్నారు. ఇంతటి ఘనమైన 150 సంవత్సరముల చరిత్ర గల ఒంగోలు నగరంలో శ్రీగిరి పై కొలువై ఉన్న మహిమాన్వితమైన అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనార్థం ఒకనాటి సాయంత్రం రాధా రమణ గుప్తా జంధ్యం మరియు ధనిశెట్టి రామునాయుడుల మధ్య జరుగుచున్న సంభాషణలలో వచ్చిన "గిరి ప్రదక్షిణ" ఆలోచనకు ఓ రూపమిస్తూ... 2023వ సంవత్సరం ఆగస్టు 29న రాధా రమణ గుప్తా జంధ్యం అధ్యక్షతన శ్రీగిరి గిరి ప్రదక్షణ కమిటీ పేరిట హిందూ ధార్మిక సంస్థ ను ఏర్పాటు చేసి వారి ఆధ్వర్యంలో ప్రతి మాసంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం రోజున (అనగా ప్రతి 27 రోజులకు ఒకసారి) శ్రీగిరి పాదపీఠం వద్దగల శ్రీ బాపూజీ గోశాలలో గోపూజ నిర్వహించుకుని గోమాత ముందు నడుస్తుండగా మంగళ వాయిద్యములు మ్రోగుచుండగా... సుందరంగా అలంకరించిన పల్లకిలో శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఉత్సవ విగ్రహాలను నగరోత్సవముగా వందలాదిగా భక్తులు సామూహికంగా గోవింద నామస్మరణ చేస్తూ... స్థానిక జిల్లా కోర్టు, జిల్లా గ్రంథాలయం, పొట్టి శ్రీరాములు విగ్రహం, కేశవ స్వామి పేట జంట ఆలయాలు, భగీరథ మహర్షి మందిరం, శర్మ కాలేజ్ క్రికెట్ గ్రౌండ్ మీదుగా గద్దలగుంట రాజా పానగల్ రోడ్డు దాటుకొని శ్రీగిరి చేరుకునే అద్భుతమైన ఆధ్యాత్మిక కార్యక్రమం శ్రీగిరి గిరి ప్రదక్షిణ ఎంతో భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తున్నారు. ఒంగోలు నగర ప్రజలలో ఆధ్యాత్మిక భావనలను ద్విగుణీకృతం చేస్తున్నారు.శ్రీ గిరి గిరిప్రదక్షిణ కమిటీగా అధ్యక్షులుగా రాధా రమణ గుప్తా జంధ్యం, ఉపాధ్యక్షులుగా తునుగుంట మల్లికార్జునరావు, దాసరి నారాయణరావు, కార్యదర్శిగా త్రిపురం మల్లికార్జునరావు, సహ కార్యదర్శిగా నేరెళ్ల శ్రీనివాసరావు, కోశాధికారిగా వలేటి కృష్ణారావు, కార్యవర్గ సభ్యులుగా నూనె రామాంజనేయులు, నల్లమల్లి కోటి సూర్యనారాయణ, ధనిశెట్టి రామునాయుడు, చలువాది బ్రహ్మయ్య మరియు కనుమర్లపూడి బాలకోటేశ్వరరావు వ్యవహరిస్తున్నారు. మరింత ఆధ్యాత్మిక భావనలను పెంచే విధంగా ఈ కమిటీ వారు ప్రభుత్వ అనుమతితో, భక్తుల ఆర్థిక సహాయ సహకారాలతో శ్రీగిరి మరియు కోర్టు కూడలి వద్ద గరుడాళ్వార్ ప్రతిమను నెలకొల్పాలని మరియు శ్రీగిరి మార్గానికి జయ విజయ విజయలతో కూడిన ఆర్చి నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు.



## ఖమ్మంలో ఘనంగా ఆయుర్వేద దినోత్సవ వారోత్సవాలు

**- పలు అవగాహన, ఆరోగ్య కార్యక్రమాలు**

ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ పిలుపు మేరకు, ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని 11వ జాతీయ ఆయుర్వేద దినోత్సవ వారోత్సవాలు సెప్టెంబర్ 21 నుండి 23 వరకు దేశవ్యాప్తంగా నిర్వహించబడుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ఖమ్మం నగరంలో పలు సేవా, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

### ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం:

ముస్తఫానగర్ జడ్పీ సెంటర్లోని కేవీఎం జెడ్ పి హెచ్ ఎస్ పాఠశాలలో ఉచిత ఆయుర్వేద మెడికల్ క్యాంప్ను నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు, స్థానిక ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు అందించారు.

### పోషణ్ అభియాన్ -- పోషకాహార అవగాహన:

శాంతి నగర్లోని యుపిఎస్ అంగన్వాడీ సెంటర్లో 'పోషణ్ అభియాన్' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు, తల్లులకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల వచ్చే వివిధ లోపాలు, వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.ఔషధ మొక్కల పెంపకం -- పర్యావరణ పరిరక్షణ: ' ప్రజా జ్యోతి పత్రిక ఖమ్మం జిల్లా ' బ్యూరో సహకారంతో వెలుగు మట్ల పార్కు నందు, అలాగే స్థానిక ఆయుర్వేద డిస్పెన్సరీ ఆవరణలో ఔషధ మొక్కలను నాటారు. ప్రకృతి ప్రసాదించిన ఔషధ మొక్కల ఆవశ్యకతను ప్రజలకు




వివరిస్తూ,పర్యావరణాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు.ముఖ్య ప్రకటన: సెప్టెంబర్ 23న "మెగా మెడికల్ హెల్త్ క్యాంప్ జాతీయ ఆయుర్వేద దినోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా సెప్టెంబర్ 23 బుధవారం ఖానాపురం, యు పి హెచ్ కాలనీ (పబ్లిక్ పార్క్ సమీపంలో) భారీ "ఉచిత మెగా మెడికల్ హెల్త్ క్యాంప్" నిర్వహించబడుతుంది. ప్రత్యేకతలు: ఈ క్యాంప్లో ప్రముఖ ఆయుర్వేద, హోమియో, యునాని సీనియర్ వైద్యులు పాల్గొని రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.ఉచిత మందుల పంపిణీ: పరీక్షించిన అనంతరం రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తారు.?కావున, ఖమ్మం నగర చుట్టుపక్కల ప్రాంత ప్రజలందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని, హెల్త్ క్యాంప్లో పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమం లో డా వై . ఉపేందర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్,డా . ప్రవీన్ కుమార్, ఎం ఓ ,ఫార్మసిస్ట్ వీరయ్య , ఎం ఎన్ ఓ క్రాంతి, బాబు నాయక్ డీపీఎం, యోగ ఇన్స్ట్రక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం 42వ డివిజన్ గొల్లబజార్ లో ఘనంగా పల్లకి సేవ కార్యక్రమం



ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: ఖమ్మం 42వ డివిజన్ గొల్ల బజారులో శ్రీ స్వామి వారి పల్లకి సేవ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది.సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం ఇంటెలిజెన్స్ ఎస్పీ రామోజీ రమేష్ గారు హాజరై స్వామివారి పల్లకిని మోశారు.ఈ కార్యక్రమాన్ని తోడేటి లింగరాజు యాదవ్ మరియు కనకదుర్గ, తోడేటి చంద్రమౌళి చైతన్య ఆధ్వర్యంలో సంఘమిత్ర యూత్ కమిటీ వారు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ కూరగాయల నాగభూషణం, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కూరాకుల వలరాజు, దొంగల తిరుపతిరావు, తొట్టి కొమరయ్య, వెంకటరమణ, బుడిగం సురేష్ కుమార్, రామిశెట్టి శ్రీనివాస్, సిహెచ్ రాము తదితర పెద్దలు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు అల్పాహారం, తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన దిలీప్ అయ్యగారికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. డివిజన్ ప్రజలందరికీ స్వామివారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన సంఘమిత్ర యూత్ కమిటీ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## భక్తి భావంతో అన్న సమారాధన నిర్వహించడం అభినందనీయం

**వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి. తిరుపతి అనూష**



విజయవాడ, సెప్టెంబర్ 21 (నేటి శుభోదయ):-పశ్చిమలోని హెచ్‌బీ కాలనీలో విఘ్నేశ్వర ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో జనసేన పార్టీ పశ్చిమ నియోజకవర్గ నాయకురాలు తిరుపతి అనూష, టీడీపీ పశ్చిమ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ముదిరాజ్ శివాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా తిరుపతి అనూష మాట్లాడుతూ వినాయక చవితి సందర్భంగా భక్తి శ్రద్ధలతో విఘ్నేశ్వర ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించడం అభినందనీయమన్నారు. భగవంతుడి సేవతో పాటు సమాజ సేవలో భాగంగా భక్తులకు అన్నప్రసాదాలు అందించడం ఎంతో సంతృప్తినిచ్చే విషయమని పేర్కొన్నారు. అన్నదానం మహాదానమని, ఆకలితో ఉన్న వారికి ఆహారం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటుకోవచ్చన్నారు. వినాయక చవితి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించేలా జరగాలని అనూష ఆకాంక్షించారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వినాయకుని వేడుకున్నానని అన్నారు. ప్రజలందరూ పండుగలను ఆనందంగా జరుపుకోవడంతో పాటు సామాజిక బాధ్యతను గుర్తించి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని తిరుపతి అనూష పిలుపునిచ్చారు. వినాయక ఉత్సవాల సందర్భంగా అన్న సమారాధనను ఏర్పాటు చేసి భక్తులకు అన్నప్రసాదాలు అందించిన నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో విఘ్నేశ్వర ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## పువ్వాడ ఉదయ నగర్ లో ఇల్లు కూల్చివేత

**- భూ అక్రమణ ప్రజా ప్రతినిధుల అవినీతి**

**అధికారుల అక్రమాలు - పోలీసుల పక్షపాతం పై**

**రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ కు కుల ప్రజాసంఘాల ఫిర్యాదు**



ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ :::జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలో కమిషన్ సభ్యులు కుడ్రం నీలాదేవి, రాంబాబు నాయక్ లతోపాటు ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పాల్గొనగా భూమి సర్వీసెస్ అట్రాసిటీ కేసులపై నిర్వహించిన సమీక్ష సమావేశం సందర్భంగా లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బానోతు బద్రు నాయక్ , వీరనారీమణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర బాయి, పువ్వాడ ఉదయ్ నగర్ లో ఇల్లు కూల్చివేత ఉదంతం , భూ అక్రమణలు, స్థానిక ప్రజాప్రతినిధుల అవినీతి, అధికారుల అక్రమాలు, కేసుల నమోదు అంశంలో పోలీసుల పక్షపాతం పై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నకరికంటి సంజీవరావు, దాసరి శ్రీను, జిల్లేపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారి తన్విత శ్రీ కుటుంబాన్ని పరామర్శించిన డాక్టర్ బానోత్ చంద్రావతి



ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: సర్పంచ్ గంగావత్ నవీన్ కుమార్తె చిన్నారి తన్విత శ్రీ అకాల మరణం నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోత్ చంద్రావతి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు."ఇలాంటి విషాద సమయంలో మాటలతో ఓదార్చడం కూడా కష్టం. ఈ బాధను తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని కోరుకుంటున్నాను" అని ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆమెతో పాటు నాగేశ్, గంగావత్ గోరియా, బానోత్ రవి, గంగావత్ లింగ, భూక్యా చందు, మాలోత్ నాగేశ్వరరావు, గంగావత్ రవి, గంగావత్ నరేంద్ర, గంగావత్ ప్రసాద్, బబానోత్ రామ, బానోత్ పంతులు, బానోత్ నాన్య బిఆర్ ఎస్ నాయకులు మందడపు శంకర్ రావు రాజు తదితరులు కుటుంబాన్ని పరామర్శించారు.

# ప్రభుత్వం దిగిరాకుంటే తీవ్ర పరిణామాలు

కరువు సహాయక చర్యలు చేపట్టడంలో చంద్రబాబు విఫలం
తుంగభద్ర, శ్రీశైలం నుంచి నీళ్లు వస్తున్నా సరిగ్గా అందించలేదు
హంద్రీనీవా ద్వారా వచ్చిన 10.5 టీఎంసీలు ఎక్కడికెళ్లాయి
అనంతపురం జిల్లాలో 2.50 లక్షల ఎకరాల్లో విత్తనం పడని పరిస్థితి
ఈ ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలూ ఎండిపోతున్నాయ్
అడుగంటిన భూగర్భ జలాలు.. 52 మి.మీ లోటు వర్షపాతం
రెండున్నరేళ్లలో ఏకంగా 200 మందికి పైగా రైతుల ఆత్మహత్యలు
ఏ ఒక్క కుటుంబానికీ పరిహారం అందించని చంద్రబాబు
పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే ఎమ్మెల్యేలకు పట్టదా
వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మండిపాటు
సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన సామూహిక దీక్షలకు సంఘీభావం



అనంతపురం బ్యూరో సెప్టెంబర్ 21 నేటి శుభోదయ : కరువు సహాయక చర్యలు చేపట్టే విషయంలో ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని, జిల్లా రైతాంగం తరఫున పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సోమవారం నగరంలోని టవర్‌క్లాక్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో 'కరువు దీక్ష'లు ప్రారంభం అయ్యాయి. సామూహిక దీక్షలో అనంత వెంకటరామిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఐదు దశాబ్దాలుగా చూడని కరువు పరిస్థితులు నేడు కనిపిస్తున్నాయని చెప్పారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 2.50 లక్షల ఎకరాల్లో విత్తనం పడలేదని, జిల్లాలో 52 మిల్లీమీటర్ల లోటు వర్షపాతం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే సాగు చేసిన పంటలన్నీ ఎండిపోతున్నాయని, తాగునీటికి ఇబ్బందులు వస్తున్నాయన్నారు. పశువులకు గ్రాసం కొరతతో పాటు నీళ్లూ దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితులు ఉంటాయని రెండు నెలల నుంచి తాము హెచ్చరిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేకపోయిందన్నారు. ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో కూడా ఎల్‌నినో పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో కనీసం సమీక్ష చేయలేదని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు ఇటు తుంగభద్ర, అటు శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నీళ్లు వస్తున్నా సరిగ్గా అందించలేకపోతున్నారని తెలిపారు. తుంగభద్ర నుంచి వచ్చే నీటిని తాగునీటికే పరిమితం చేశారని, ఆందోళనలు చేస్తే అరకొరగా రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో పంటలకు అందించారని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి హంద్రీనీవా ద్వారా వచ్చే నీటిని సౌత్ కెనాల్, నార్త్ కెనాల్, తాడిపత్రి బ్రాంచ్ కెనాళ్లకు ఇవ్వాలని కోరినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికే హంద్రీనీవా నుంచి 10.5 టీఎంసీలు డ్రా చేశామని అంటున్నారని, ఆ నీళ్లు ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు ఉంటే వర్షాలు లేకపోవడంతో ఎండిపోతున్నాయన్నారు. సుమారు లక్ష ఎకరాల్లో ఉన్న చీనీ పంటలు ఎండిపోతుంటే రైతులే తొలగించుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు జిల్లాలో భూగర్భ జలాలు 16 మీటర్ల నుంచి 30 మీటర్ల లోతుకు పడిపోయాయని తెలిపారు. వందల అడుగుల లోతుకు బోర్లు వేస్తున్నా నీళ్లు పడని పరిస్థితులు ఉన్నాయని చెప్పారు. 2004 నుంచి ఇప్పటి వరకు రెండున్నరేళ్లలో జిల్లాలో ఏకంగా 200 మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకుంటే ఒక్క కుటుంబానికీ పరిహారం అందించలేదని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగాన్ని పణంగా పెట్టి శ్రీశైలం నుంచి కరెంట్ ఉత్పత్తి పేరుతో నీళ్లను తెలంగాణ తరలిస్తుంటే ఆ నీళ్లు మళ్లీ కృష్ణా డెల్టాకే చేరుతాయని చెప్పడం దారుణమన్నారు. అటు పట్టిసీమ, ఇటు శ్రీశైలం నుంచి నీళ్లు డెల్టాకే తరలించుకుంటూ పోతే మా పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పరిస్థితులు ఇంత దారుణంగా ఉంటే మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఏమాత్రం పట్టడం లేదని విమర్శించారు. కరువు పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలన్న ఆలోచన చేయడం లేదని, ఎంత సేపూ తమ ఆదాయాన్ని ఎలా రెట్టింపు చేసుకోవాలన్న ఆలోచనే ప్రజాప్రతినిధుల్లో కనిపిస్తోందని అన్నారు. కరువు సహాయక చర్యలు చేపట్టకపోతే రైతాంగం తరఫున ఉద్యమిస్తామని హెచ్చరించారు. సామూహిక దీక్షల్లో వైఎస్ఆర్‌సీపీ తరఫున మాజీ మేయర్ మహమ్మద్ వసీం, బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, వైసీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎద్దుల అమర్నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

# డాక్టర్ సిరీషకు ప్రతిష్ఠాత్మక పురస్కారం

**- ఇసార్ ఏఆర్‌టీ అత్యుత్తమ పురస్కారం -- 2026**

**-- వైద్య సేవలకు దక్కిన అరుదైన గుర్తింపు**

**- ఖమ్మం నుంచే ఆధునిక సంతాన సాఫల్య వైద్య సేవలు**




ఖమ్మం, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ::: ఖమ్మం ఓయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్ ప్రముఖ సంతాన సాఫల్య వైద్య నిపుణురాలు డాక్టర్ కె.వి. సిరీషకు ప్రతిష్ఠాత్మక ఇసార్ ఏఆర్‌టీ అత్యుత్తమ పురస్కారం -- 2026 లభించింది. వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు గుర్తింపుగా క్లినికల్ ఎక్సలెన్స్ -- యువ ప్రతిభ విభాగంలో ఈ పురస్కారం అందుకున్నారు. సంతాన సాఫల్య చికిత్స రంగంలో అంకితభావంతో సేవలందిస్తూ, ఎంతోమంది దంపతులకు తల్లిదండ్రులుగా మారే ఆశను నెరవేర్చేందుకు కృషి చేస్తున్న డాక్టర్ సిరీషకు ఈ అవార్డు దక్కడం పట్ల వైద్య వర్గాలు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**- ఎంతోమంది దంపతుల బాధ నాకు తెలుసు**

ఈ సందర్భంగా డాక్టర్ సిరీష మాట్లాడుతూ "అమ్మా అనే పిలుపు కోసం ఎంతోమంది దంపతులు ఎదురుచూస్తున్నారని నాకు తెలుసు. సంతానం కోసం వారు పడే బాధను, ఎదురుచూపులను దగ్గరగా చూస్తున్నాను. అందుకే ప్రతి దంపతుల సమస్యను ప్రత్యేకంగా అర్థం చేసుకుని, వారికి అవసరమైన వైద్య సలహాలు, చికిత్స అందించాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నాం. ఈ పురస్కారం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చినప్పటికీ, అంతకంటే ఎక్కువగా మరింత బాధ్యతను పెంచింది. సంతానం కోసం వచ్చే ప్రతి దంపతులకు నమ్మకమైన వైద్య సేవలు అందించేందుకు నా వంతు కృషి చేస్తాను" అని తెలిపారు.

**- ఖమ్మంలోనే ఆధునిక వైద్య సేవలు**

సంతాన సాఫల్య చికిత్స కోసం ఖమ్మం ప్రాంత ప్రజలు ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఓయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్‌లోనే ఆధునిక సంతాన సాఫల్య వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అవసరాన్ని బట్టి దంపతులకు తగిన పరీక్షలు, వైద్య సలహాలు, చికిత్సా విధానాలను సూచిస్తూ ముందుకు తీసుకెళు_న్నామని పేర్కొన్నారు. హైదరాబాద్, విజయవాడ వంటి నగరాలకు వెళ్లే ఇబ్బందులు తగ్గిస్తూ ఖమ్మంలోనే నిపుణుల వైద్య సేవలు పొందే అవకాశం ఉండటం స్థానిక దంపతులకు ఉపయోగకరంగా మారిందన్నారు.

**- వైద్య సేవలకు గుర్తింపుగా అవార్డు**

వైద్య రంగంలో సేవలతో పాటు సంతాన సాఫల్య చికిత్సపై అవగాహన కల్పిస్తూ డాక్టర్ సిరీష చేస్తున్న కృషికి ఈ పురస్కారం మరింత గుర్తింపును తీసుకొచ్చింది. ప్రతిష్ఠాత్మక పురస్కారం అందుకున్న డాక్టర్ కె.వి. సిరీషకు పలువురు వైద్యులు, సిబ్బంది, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకోవాలని, మరెంతోమంది దంపతులకు సంతాన సాఫల్యాన్ని అందించే సేవలను కొనసాగించాలని ఆకాంక్షించారు.

## ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్ మూసివేత

విజయవాడ, సెప్టెంబర్ 21 (నేటి శుభోదయ):- దసరా ఉత్సవాల నిమిత్తం భక్తులకు సరైన సౌకర్యాలు కల్పించేందుకు గాను ఇంద్రకీలాద్రి ఘాట్ రోడ్ మరామత్తుపనులు చేపట్టడంతో నేటి ఉదయం నుంచి వారం రోజుల పాటు ఘాట్ రోడ్ మూసివేస్తామని ఆలయ ఈఓ తెలిపారు. వారం రోజులు శ్రీ కనకదుర్గానగర్ మార్గం నుండి భక్తులు దేవస్థానానికి చేరుకోవాలని తెలిపారు. హైదరాబాద్ నుండి వచ్చే భక్తులు పున్నమి ఘాట్లో తమ వాహనాలు పార్కింగ్ చేసుకొని, అక్కడ నుండి దేవస్థానం ఏర్పాటు చేసిన ఉచిత బస్ ల ద్వారా దేవస్థానానికి చేరుకోవాలని, విశాఖపట్నం, చెన్నయ్ తదితర ప్రాంతాల నుండి వన్ టౌన్ వైపు వచ్చే భక్తులు సీతమ్మ వారి పాదాలు వద్ద ఉన్న హోల్డింగ్ ఏరియాలో తమ వాహనాలు పార్కింగ్ చేసుకొని దేవస్థానం వారు ఏర్పాటు చేసిన ఉచిత బస్ ల ద్వారా దేవస్థానానికి చేరుకోవాలని ఆలయ ఈఓ వి.కె. శీనానాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వారం రోజులు పార్కింగ్ ప్రదేశాలు నుండి దేవస్థానానికి ఉచిత రవాణా సదుపాయం ఏర్పాటు చేసామని, భక్తులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

## జగ్గంపేటలో 'వెన్నుపోటు ప్రభుత్వం..

**వెన్నుపోటు పాలనపై పోరు'**

**కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి తోట నరసింహం విమర్శలు**




కాకినాడ జిల్లా,జగ్గంపేట, సెప్టెంబర్ 21 నేటి శుభోదయ : జగ్గంపేట బాలాజీ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు ప్రభుత్వం.. వెన్నుపోటు పాలనపై పోరు' కార్యక్రమం నిర్వహించారు. జగ్గంపేట మండల పార్టీ అధ్యక్షుడు రావుల గణేష్ రాజా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వైఎస్సార్‌సీపీ ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. వాలంటీర్లకు నెలకు రూ.10 వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటీర్ వ్యవస్థను రద్దు చేశారని ఆయన ఆరోపించారు. అలాగే, నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా రూపొందించిన 'రెడ్ బుక్' ఆధారంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలు జరుగుతున్నాయని తోట నరసింహం ఆరోపించారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందంటూ గతంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన ఆరోపణలపై కూడా ఆయన స్పందించారు. దర్యాప్తు వివరాలు జంతువుల కొవ్వు కలిసినట్లు నిర్ధారించలేదని పేర్కొంటూ, తిరుమల వంటి పవిత్రమైన అంశాలను రాజకీయాలకు ఉపయోగించకూడదని అన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి పనిచేయాలని తోట నరసింహం పిలుపునిచ్చారు. ఘనంగా సన్మానం జగ్గంపేట మండల జడ్పీటీసీ ఒమ్మి బిందు మాధవి రఘురాం, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఎంపీటీసీల పదవీకాలం పూర్తవుతున్న సందర్భంగా వారిని కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఒమ్మి రఘురాం, రావుల గణేష్ రాజా, కరటూరి వీర్రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఆధార్ అప్డేట్ కేంద్రాలు

**విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి: ఎంఈఓ టి. రవికుమార్**



కారంపూడి సెప్టెంబర్ 21: ఆర్ సి ఇన్చార్జ్ నేటి శుభోదయ కారంపూడి: మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్ వివరాల నవీకరణ కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి టి. రవికుమార్ సోమవారం తెలిపారు. మాండేటరీ బయోమెట్రిక్ అప్డేట్ కార్యక్రమంలో భాగంగా ఎస్‌జీఎస్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఈ కేంద్రాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 20వ తేదీ వరకు కారంపూడిలోని బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మెయిన్, కస్తూర్బా గాంధీ పాఠశాల, మోడల్ స్కూల్, రెయిన్‌బో ఇంగ్లీష్ మీడియం స్కూల్, దివ్య సాయి స్కూల్, అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్, సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లలో ఆధార్ అప్డేట్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు అవసరమైన పత్రాలతో ఆయా కేంద్రాలను సందర్శించి ఆధార్ వివరాలను నవీకరించుకోవచ్చని చెప్పారు. ఆధార్ కార్డు లేని విద్యార్థులకు నమోదు చేసుకునే అవకాశం కల్పించడంతో పాటు, ఆధార్ కార్డుల్లో ఉన్న తప్పులను సరిచేసుకునేందుకు కూడా సదుపాయం ఉంటుందని వివరించారు. మండలంలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధార్ వివరాలను సకాలంలో అప్డేట్ చేసుకోవాలని ఎంఈఓ టి. రవికుమార్ కోరారు.

## కోరుకొండ శ్రీ సరస్వతి విద్యానికేతాన్లో శాస్త్రోక్తంగా శ్రీ మహా గణపతి హోమం..!!



కోరుకొండ, సెప్టెంబర్ 21, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె)- తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండల కేంద్రంలోని సరస్వతి విద్యానికేతాన్ ఆవరణలో గణపతి నవరాత్రుల మహోత్సవాలు సందర్భంగా సోమవారం గణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల అధినేత వెనకటి గంగాధర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక రాజకీయ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గంగాధర్‌రావు మాట్లాడుతూ ప్రజలందరూ.... ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ గణపతి హోమం నిర్వహించినట్లు తెలిపారు.స్కూల్ ఆవరణలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి బుధవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.